విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 సంచిక :124 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ మంగళవారం 22 సెప్టెంబర్ 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## యూపీఐ ఛార్జీలు వద్దు

- కేంద్రానికి మొబైల్ రిటైలర్ల విజ్ఞప్తి
- యూపీఐ చెల్లింపులపై ఛార్జీల నుంచి మినహాయింపు కోరిన రిటైలర్లు
- అతి తక్కువ లాభాలతో వ్యాపారం చేస్తున్నామని ఆవేదన
- 0.4 శాతం ఎండీఆర్ విధిస్తే వ్యాపార మనుగడకే ప్రమాదమని హెచ్చరిక
- ఇప్పటికే స్మార్ట్‌ఫోన్ల ధరలు భారీగా పెరిగాయని వెల్లడి
- ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రికి లేఖ రాసిన మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్

2

## రామ మందిరంలో భారీ కుంభకోణం

- 105 సార్లు విరాళాల చోరీ
- సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిర్ధారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం
- ఈ కేసులో ఇప్పటివరకు 8 మంది అరెస్ట్
- సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలుకు ఏర్పాట్లు
- ట్రస్టు ఉన్నత పదవుల నుంచి చంపత్ రాయ్, అనిల్ మిశ్రా తొలగింపు

2



## పర్యటనల వల్ల ఆర్థిక సంబంధాలకు రాజకీయ ఊతం

- అక్టోబర్ 20 నుంచి భారత్-న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలు
- గుడ్‌న్యూస్ చెప్పిన కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూశ్ గోయల్
- దసరా పండగ నుంచి అమల్లోకి భారత్-కివీస్ ఎఫ్‌టీఏ అమల్లోకి వస్తుందని వెల్లడి
- ఈ డీల్ ఇరుదేశాల ఆర్థిక భాగస్వామ్యంలో మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం

2





## ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు స్థానం లేదు

- టీచర్లపై రాడ్లు, కర్రలతో దాడి చేసినవారిపై కఠిన చర్యలు
- టీచర్లపై రౌడీషీటర్లు, గంజాయి బ్యాచులను ఉసిగొల్పడం దారుణం
- స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైఎస్సార్సీపీ నేతల దాడిని ఖండించిన మంత్రి లోకేశ్
- శాప్ కార్యాలయం వద్ద రాళ్లు, కోడిగుడ్లతో అల్లర్లు

అమరావతి

ఉపాధ్యాయులపై వైఎస్సార్సీపీ శ్రేణులు దాడికి దిగడం దారుణమని విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. క్రీడలతో దేశ పతాకాన్ని రెపరెపలాడించి, ప్రతిభతో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన టీచర్లపై రాడ్లు, కర్రలతో దాడి చేయడ అనాగరికమని ధ్వజమెత్తారు. ఉపాధ్యాయులపై దాడికి - మిగతా3లో

# పేద ప్రజల సంక్షేమమే లక్ష్యం

- కుప్పంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ప్రతి పేదవాడి కళ్ళల్లో ఆనందం చూడాలన్నదే తన లక్ష్యం
- నారావారిపల్లె జన్మను ఇస్తే.. కుప్పంరాజకీయ జీవితాన్ని ఇచ్చింది
- గడచిన రెండేళ్లలో రెట్టింపు ఉత్సాహంతో అభివృద్ధి పనులు చేస్తున్నాం
- కుప్పాన్ని ఓ మోడల్ నియోజకవర్గంగా మార్చేందుకు అవసరమైన ప్రణాళికలన్నీ చేస్తున్నాం



చిత్తూర్

రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పేద ప్రజల జీవితాల్లో వెలుగు నింపాలని నిరంతరం పనిచేస్తున్నామని ప్రతి పేదవాడి కళ్ళల్లో ఆనందం చూడాలన్నదే తన లక్ష్యమని అందుకోసం పనిచేస్తూనే ఉంటానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు కుప్పంలో సీఎం చంద్రబాబు సోమవారం పర్యటించి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కుప్పంలో రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆర్డీఓ, ఏఎస్పీ కార్యాలయాలకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి. రూ.3.30 కోట్ల వ్యయంతో నిర్మించిన సమగ్ర ఘన వ్యర్ధాల నిర్వహణ ప్లాంట్, మెటిరీయల్ రికవరీ వివరాలు 2లో..



## సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు షాక్

- పౌరసత్వం కేసులో దర్యాప్తునకు ఆదేశాలు
- పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే ఎన్నికల జాబితాలో సోనియా పేరు ఉందని ఆరోపణలు
- దీనిపై దర్యాప్తును తిరస్కరిస్తూ గతంలో మేజిస్ట్రియల్ కోర్టు ఆదేశాలు
- తాజాగా కొట్టివేస్తూ ఆదేశాలు

2



## డ్రోన్ల దాడికి రష్యా ప్రతీకారం.. జపోరిఝియాపై భీకర దాడులు

- రష్యాపై 1,000కి పైగా డ్రోన్లతో దాడి చేసిన ఉక్రెయిన్
- జపోరిఝియా నగరంపై ప్రతీకార దాడులు ప్రారంభించిన రష్యా
- నివాస భవనాలపై దాడులు జరుగుతున్నాయన్న జెలెన్స్కీ
- ఉక్రెయిన్ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించిందన్న డొనాల్డ్ ట్రంప్
- న్యూయార్క్‌లో ట్రంప్‌తో జెలెన్స్కీ భేటీ అయ్యే అవకాశం

2

## ఏపీ తీరం వైపు దూసుకొస్తున్న వాయుగుండం

- పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండం
- ప్రస్తుతం విశాఖకు 470 కి.మీ. దూరంలో కేంద్రీకృతం
- రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే సూచన
- సెప్టెంబర్ 23న రాత్రి ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరం దాటే అవకాశం



అమరావతి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ఇది ప్రస్తుతం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరం వైపు దూసుకొస్తోంది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం సాయంత్రం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం, ఈ వాయుగుండం పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉంది. ప్రస్తుతం ఈ వాయుగుండం ఒడిశాలోని పూరీకి ఆగ్నేయంగా 310 కిలోమీటర్లు, గోపాల్‌పూర్‌కు తూర్పు ఆగ్నేయంగా 310 కిలోమీటర్ల వివరాలు 2లో..

# రాష్ట్రవ్యాప్తంగా చెరువుల ఆధునికీకరణ



- మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన పవన్ కల్యాణ్
- పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన
- ఫకృద్దీన్ పాలెంలో సుందరీకరించిన చెరువు ప్రారంభం
- పిఠాపురంలో రూ. 6 కోట్లతో 11 చెరువుల ఆధునీకరణ
- గ్రామాల్లో చెరువులను ఆహ్లాద, ఆరోగ్య కేంద్రాలుగా మార్చే ప్రణాళిక

అమరావతి

ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ సోమవారం సొంత నియోజకవర్గంలో పర్యటించారు. ఫకృద్దీన్ పాలెం గ్రామంలోని మైసమ్మ చెరువు గట్టుపై వెలసిన మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, గ్రామీణ చెరువులకు సరికొత్త రూపునిచ్చే బృహత్తర కార్యక్రమంలో భాగంగా రూ. 73 లక్షల వ్యయంతో సుందరీకరించిన మైసమ్మ చెరువును ప్రజలకు అంకితం చేశారు. గ్రామాల్లోని చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా, ప్రజలందరికీ ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచే సామాజిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ తెలిపారు. వివరాలు 2లో..



## మరో చైనా కారాదనే భారత్‌పై అమెరికా టార్గెట్!

- టారిఫ్‌లకు అసలు కారణం ఇదేనా?
- 1998లో పోఖ్రాన్ అణు పరీక్షల సమయంలో భారత్‌పై అమెరికా ఆంక్షలు
- 2001 సెప్టెంబర్‌లో ఎత్తివేసిన నాటి జార్జ్ బుష్ ప్రభుత్వం

2



## లిక్కర్ స్కామ్‌ను పక్కదారి పట్టించేందుకే వైసీపీ కుట్ర

- శాప్ వద్ద రాద్ధాంతం చేసింది రౌడీషీటర్లు, వివిధ కేసుల్లో నిందితులే
- డీఎస్సీపై ఆందోళన చేసింది అభ్యర్థులు కాదు, రౌడీషీటర్లని హోంమంత్రి అనిత ఆరోపణ
- శాప్ కార్యాలయం వద్ద అల్లర్లకు పాల్పడ్డారని అనిత ఆగ్రహం
- నిరసనకారుల్లో చాలామందిపై కేసులు ఉన్నాయి
- అల్లర్లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

2లో

# పేద ప్రజల సంక్షేమమే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

సెంటర్ ప్రారంభించిన సీఎం చంద్రబాబు. 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.2.70 కోట్లతో చేపట్టనున్న మల్లనూర్ జూనియర్ కాలేజి పనులకు భూమిపూజ చేసిన ముఖ్యమంత్రి. కుప్పం మున్సిపాలిటీ లో రూ.38 కోట్ల విలువైన ప్రభుత్వ పనులకు శంకుస్థాపన చేసిన సీఎం. వ్యవసాయ ఫీడర్ల కోసం 15 మెగావాట్ల పీఎం కుసుమ్ సోలార్ ప్రాజెక్టులను ప్రారంభించిన చంద్రబాబు.కార్యక్రమానికి హాజరైన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. చంద్రబాబు నాయుడు ప్రజలతో నేరుగా మాట్లాడారు ప్రజలు మాట్లాడుతూ మీ పాలనలో అద్భుతంగా సంక్షేమం కొనసాగుతున్నదని అన్ని పథకాలు నేరుగా అందుతున్నాయని లబ్ధిదారులు అన్నారు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కుప్పం చంద్రబాబు పర్యటంలో తరలివచ్చారు గత పర్యటనలకు భిన్నంగా చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన కొనసాగింది నిత్యం ప్రజలతో మమేకమవుతూ చంద్రబాబు నాయుడు ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పార్టీ కార్యకర్తలకు నాయకులతో మాట్లాడుతూ వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు అక్కడే ఉన్న అధికారులకు పార్టీ నాయకులకి కార్యకర్తలకు వెంటనే సహాయం చేయాలని చంద్రబాబు ఆదేశించారు

ఏ పని చేయాలన్నా కుప్పం నుంచే నాంది పలుకుతాం.

నారావారి పల్లె నాకు జన్మను ఇస్తే కుప్పం నాకు రాజకీయ జీవితాన్ని ఇచ్చిందని సీఎం చంద్రబాబు అన్నారు. కుప్పంలో సీఎం మాట్లాడుతూ.. ఏ పని చేయాలన్నా కుప్పం నుంచే నాంది పలుకుతాం.

గడచిన రెండేళ్లలో రెట్టింపు ఉత్సాహంతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. కుప్పాన్ని ఓ మోడల్ నియోజకవర్గంగా మార్చేందుకు అవసరమైన ప్రణాళికలన్నీ చేస్తున్నాం.

హంద్రీనీవా కాలువ ద్వారా కుప్పానికి నీరు తీసుకువచ్చి 133 చెరువులను నింపగలిగాం.

ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన కరవు పరిస్థితులు నెలకున్నాయి. త్వరలో యామిగాని పల్లి, మనపల్లి ప్రాంతాల్లో రిజర్వాయర్లను ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నాం.

కుప్పంలో 550 పైగా మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను లిఫ్ట్ ఇరిగేషన్, పైపులైన్లతో అనుసంధానం చేస్తాం.

పశుదాణాకు కూడా ఇబ్బంది లేకుండా కార్యాచరణ చేపట్టాం. రాష్ట్రంలో ప్రకృతి సేద్యం, పీఎండీఎస్ విధానాల ద్వారా ఎల్ నినోను మన రైతులంతా ఎదుర్కోవాలి.

మైక్రో ఇరిగేషన్ ద్వారా ఉద్యాన పంటలను కూడా సాగు



చేసేలా చర్యలు చేపట్టాం. ఈ ఏడాది మన రిజర్వాయర్లలో తక్కువ నీరు ఉంది. మిగిలిన నీటిని సద్వినియోగం చేసుకోవాలి.

చిరు ధాన్యాల పంటల ద్వారా తక్కువ నీటి వినియోగంతో సాగు చేసే ఆస్కారం ఉంది. పశుపోషణ, పౌల్ట్రీ లాంటి అంశాలపై దృష్టి సారించటం ద్వారా ఎక్కువ ఆదాయాన్ని రైతులు, మహిళలు సాధించే అవకాశం ఉంటుంది.

రెండు నెలల క్రితం పర్యటనకు వచ్చినప్పుడు కుప్పంలో రూ. 7939 కోట్ల విలువైన పనులు ప్రాజెక్టుల శంకుస్థాపన చేశాం. ఇప్పుడు మళ్లీ కుప్పం మున్సిపాలిటీలో రూ. 38 కోట్ల విలువైన ప్రభుత్వ పనులకు శంకుస్థాపన చేశాం. అలాగే రూ.289 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కూడా భూమి పూజ నిర్వహించాం. రూ.3.30 కోట్ల సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ, మెటీరియల్ రికవరీ ప్లాంట్ ప్రారంభించాం. వ్యవసాయ ఫీడర్ల కోసం 14-15 మెగావాట్ల పీఎం కుసుమ్ సోలార్ ప్రాజెక్టులను కూడా ప్రారంభించాం.రూ.10 కోట్లతో 35 పాఠశాలల్లో వివిధ అభివృద్ధి పనులు, ఎన్ఏపీసీ భవనంలో మానస సరోవర్ గ్లోబల్ యూనివర్సిటీ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభించుకున్నాం.

రూ.2 కోట్లతో స్థానిక ఉత్పత్తులను విక్రయించుకునేలా ఆధునిక రైతు బజార్ నిర్మిస్తాం. రూ.13 కోట్ల వ్యయంతో కుప్పం ఆర్డీఓ కార్యాలయం, డీఎస్పీ కార్యాలయాలను కూడా నిర్మిస్తున్నాం.

అలాగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలను రూ.15 కోట్ల వ్యయంతో చేపడతాం.

రూ.8 కోట్ల వ్యయంతో కుప్పం మున్సిపాలిటీ పరిధిలో హైమాస్ట్ వీధి దీపాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. మున్సిపాలిటీ పరిధిలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం కూడా పూర్తి చేస్తున్నాం.

రూ.184 కోట్ల వ్యయంతో మున్సిపాలిటీ పరిధిలో అండర్ గ్రౌండ్ యుటిలిటీని నిర్మించాలని నిర్ణయించాం.

హంద్రీనీవా సుజల స్రవంతి కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా బీరువాని పల్లె వద్ద రూ.45 కోట్లతో ఓ రిజర్వాయర్ నిర్మిస్తాం. మల్లనూరు దగ్గర రూ.27 కోట్ల వ్యయంతో ఓ జూనియర్ కాలేజీని ఏర్పాటు చేస్తాం. రూ. 16 కోట్ల వ్యయంతో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు నిర్మించేలా, హెరిటేజ్ గ్రానైట్ స్టోన్ క్లస్టర్ ఏర్పాటు చేయబోతున్నాం. కుప్పం మార్కెట్ యార్డులో రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశాం.

రాష్ట్రంలో డ్వాక్రా మహిళలకు డిజిటల్ లిటరసీతో పాటు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా శిక్షణ అందిస్తున్నాం. కుప్పంలోనూ 8500 మంది మహిళలకు శిక్షణ అందుతోంది.

కుప్పంలో 32 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. రెండేళ్లలో పరిశ్రమలు, అనుబంధ కార్యక్రమాలతో యువతకు ఉద్యోగాలు ఉపాధి వచ్చింది.

స్థానికంగా వచ్చిన పరిశ్రమల్లో స్థానిక యువతకే ఉద్యోగాలు వచ్చేలా నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. బిర్లా ఇనిస్టిట్యూట్ ఇప్పటికే నైపుణ్య శిక్షణ ఇస్తోంది. మానస సరోవర్ గ్లోబల్ యూనివర్సిటీ ద్వారా నైపుణ్య శిక్షణ అందిస్తాం అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

# రాష్ట్రవ్యాప్తంగా చెరువుల ఆధునికీకరణ

-మొదటిపేజీ తరువాయి

ఫకృద్దీన్ పాలెంలోని మైసమ్మ చెరువును రాష్ట్రానికే ఒక మోడల్‌గా అభివృద్ధి చేసినట్లు వివరించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, పిల్లల పార్కును ఆయన ప్రారంభించారు. చెరువు గట్టుపై కలియదిరుగుతూ, అక్కడి వృక్షాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న నందీశ్వరుడి సహిత శివుని విగ్రహాన్ని పరిశీలించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా చెరువు గట్టును బలోపేతం చేసి, పచ్చదనంతో నింపారు. ప్రజలు వ్యాయామం చేసుకునేలా ఓపెన్ జిమ్‌తో పాటు, జాతీయ భావాన్ని పెంపొందించేలా జెండా స్థూపాన్ని కూడా ఏర్పాటు చేశారు. చెరువు పక్కనే చిన్నారుల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన పార్కును పిల్లలతో కలిసి ప్రారంభించిన పవన్ కల్యాణ్, వారితో సరదాగా గడిపి చాక్లెట్లు పంచారు.

### రాష్ట్రవ్యాప్తంగా చెరువుల ఆధునికీకరణ

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన నిధులతో రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల సుందరీకరణ పనులు చేపట్టినట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే రూ. 6 కోట్లతో 11 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, వీటికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పరిధిలో అభివృద్ధి చేసిన 14 చెరువుల ఫొటో గ్యాలరీని తిలకించారు. ఈ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని అన్ని చెరువుల పనులు పూర్తి



చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పర్యటనలో భాగంగా ఆయన గ్రామ సచివాలయాన్ని, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# జనసేన తీర్థానికి వైఎస్ఆర్‌సీపీ సీనియర్ల దూరమా?

**ఒంగోలు :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ప్రాధాన్యం క్రమంగా తగ్గుతున్న క్రమంలో, ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు గుడ్‌బై చెబుతూ కొత్త దారులు వెతుక్కుంటున్నారు. విజయనగరం జిల్లా జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్ఆర్‌సీపీకి రాజీనామా చేసిన వెంటనే నేరుగా టీడీపీ గూటికి చేరడం చర్చనీయాంశం అయింది. ప్రతిపక్షం నుంచి బయటకు వస్తున్న నేతలకు కూటమి రూపంలో రెండు వేదికలు అందుబాటులో ఉన్నప్పటికీ, మెజారిటీ నాయకులు జనసేన వైపు చూడకుండా కేవలం తెలుగుదేశం వైపే మొగ్గు చూపడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం జనసేనలో చేరిన తర్వాత లభిస్తుందనుకున్న ప్రాధాన్యత పై రాజకీయ నేతలకు ఉన్న అనుమానాలే. వైఎస్ఆర్‌సీపీ నుంచి బయటకు వచ్చి జనసేన తీర్థం పుచ్చుకున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. రాయలసీమ , ప్రకాశం జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న బాలినేని వంటి సీనియర్ నేత జనసేనలో చేరినప్పటికీ, ఆయనకు క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత లభించడం లేదనే అభిప్రాయం ఉంది. పైగా ఒంగోలు పరిసర నియోజకవర్గాల్లో కూటమి భాగస్వామి అయిన టీడీపీ స్థానిక నేతలతో బాలినేనికి తరచూ విభేదాలు రావడం, కూటమి శ్రేణుల మధ్య ఘర్షణలు వాతావరణం నెలకొనడం వంటివి ఆయనకు మరింత ఇరకాటంగా మారాయి.జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ విషయంలో అనుసరిస్తున్న కఠినమైన



ఫిల్టరింగ్ విధానం కూడా ఈ వలసల వేగాన్ని తగ్గించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలోకి వచ్చే వారి విషయంలో పవన్ జాగ్రత్తలు వహిస్తున్నారు. గతంలో జనసేనను, పవన్ కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా తీవ్రస్థాయిలో విమర్శించిన వైఎస్ఆర్‌సీపీ నేతలను, ,నియోజకవర్గాల్లో వివాదాస్పద ఇమేజ్ ఉన్న వారిని పార్టీలోకి చేర్చుకోవడానికి ఆయన సుముఖంగా లేరు. దీంతో పార్టీలోకి రావాలని ఆశపడే నేతలకు కనీసం గ్రీన్ సిగ్నల్ కూడా లభించని పరిస్థితి నెలకొంది. అధికారిక ప్రాధాన్యత , నియోజకవర్గాల్లో పట్టు సాధించే క్రమంలో టీడీపీయే సరైన వేదిక అని జంపింగ్ నేతలు భావిస్తున్నారు. పాత వైఎస్ఆర్‌సీపీ నేతలకు నియోజకవర్గ స్థాయి వ్యవస్థలపై, అధికారులపై ప్రభావం చూపగలిగే బలమైన కేడర్ అవసరం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీకి గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు బలమైన యంత్రాంగం ఉంది. జనసేన ఓటు బ్యాంకు బలమైనదే అయినప్పటికీ, నియోజకవర్గంలో రాజకీయం నడపాలంటే టీడీపీ అధికారిక ఛత్రం కింద ఉండటమే రక్షణ అని సీనియర్ నాయకులు లెక్కింపులు వేస్తున్నారు.జనసేన అంతర్గత నిర్మాణం, నిర్ణయాల ప్రక్రియ కూడా ఇక్కడ ఒక అంశంగా మారింది. పవన్ కళ్యాణ్ చుట్టూ ఉన్న కోటరీ , పరిమితమైన పార్టీ పదవుల కేటాయింపు వల్ల, కొత్తగా చేరే వైఎస్ఆర్‌సీపీ మాజీ సీనియర్లకు సముచిత స్థానం దక్కుతుందా లేదా అనే సంశయం ఉండిపోయింది. బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతాన్ని చూసిన తర్వాత చాలామంది వైఎస్ఆర్‌సీపీ సీనియర్లు జనసేనలోకి వెళ్లి మూలన పడేకంటే, నేరుగా టీడీపీలోకి వెళ్లి తమ ఉనికిని చాటుకోవడమే మేలు అనే ముగింపునకు వచ్చినట్లు కనిపిస్తోంది. ఈ పరిణామాలు క్షేత్రస్థాయిలో జనసేన విస్తరణకు కొంత అడ్డంకిగా మారినప్పటికీ, స్వచ్ఛమైన ఇమేజ్ ఉన్నవారినే పార్టీలోకి తీసుకోకూడదనే పవన్ కళ్యాణ్ వ్యూహం సుదీర్ఘకాలంలో పార్టీ సిద్ధాంతానికి మేలు చేస్తుందని జనసేన వర్గాలు వాదిస్తున్నాయి. అయితే, ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ బలహీనపడుతున్న ఈ కీలక సమయంలో వలసొచ్చే బలమైన నేతలను ఆకర్షించడంలో జనసేన వెనుకబడితే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని నిర్మించుకోవడం ఆ పార్టీకి అతిపెద్ద సవాలుగా మారే అవకాశముంది.

## ఏపీ తీరం వైపు దూసుకొస్తున్న వాయుగుండం..

-మొదటిపేజీ తరువాయి

దూరంలో ఉంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్‌లోని కళింగపట్నానికి 390 కిలోమీటర్లు, విశాఖపట్నానికి తూర్పున 470 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై కొనసాగుతోంది. రాబోయే 24 గంటల్లో ఈ వాయుగుండం పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆ తర్వాత కూడా ఇదే దిశలో కదులుతూ సెప్టెంబర్ 23వ తేదీ రాత్రి నుంచి 24వ తేదీ తెల్లవారుజాము మధ్యలో తీవ్ర వాయుగుండంగానే ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాలను దాటుతుందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా విశాఖపట్నం, గోపాల్‌పూర్ మధ్య ఇది తీరం దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరప్రాంతాల అధికారులు అప్రమత్తమయ్యారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు.

## లిక్కర్ స్కామ్‌ను పక్కదారి పట్టించేందుకే వైసీపీ కుట్ర

డీఎస్సీ నియామకాలపై ఫిర్యాదు చేసేందుకు విజయవాడలోని శాప్ కార్యాలయానికి వచ్చిన వారు అభ్యర్థులు కాదని, వారిలో చాలామంది రౌడీషీటర్లు, ఇతర కేసుల్లో నిందితులు ఉన్నారని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సంచలన ఆరోపణలు చేశారు. లిక్కర్ స్కామ్ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ ఈ రాద్ధాంతం సృష్టిస్తోందని ఆమె తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు అనిత ఓ వీడియో పోస్ట్ చేశారు. శాప్ కార్యాలయం వద్దకు వచ్చిన వారి వీడియోలను క్షుణ్ణంగా పరిశీలించామని అనిత తెలిపారు. “వారిలో విద్యపై అవగాహన ఉన్నవారు, ఏనాడైనా పరీక్ష రాసిన ముఖాలు ఒక్కటైనా ఉన్నాయా? డీఎస్సీపై మాట్లాడే అర్హత వారికి ఉందా?” అని అనిత ప్రశ్నించారు. కార్యాలయంలోకి వచ్చి అధికారులతో మాట్లాడే ధైర్యం లేక, గేటు బయటే కూర్చుని అల్లర్లకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఉపాధ్యాయులపై దాడులు చేయడం, రౌడీయిజం, దౌర్జన్యానికి పాల్పడటమే గొడ్డలి పార్టీ రాజకీయమా అని అనిత నిలదీశారు. చదువు పట్ల, చదువు చెప్పే ఉపాధ్యాయుల పట్ల జగన్‌కు కనీస గౌరవం కూడా లేదని దుయ్యబట్టారు. పదో తరగతి ప్రశ్నపత్రం లీక్ చేసిన వారికి, టీచర్ ఉద్యోగం కోసం పడే కష్టం ఎలా తెలుస్తుందని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. డీఎస్సీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతోందని న్యాయస్థానమే స్పష్టం చేసినా, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ను లక్ష్యంగా చేసుకుని గొడ్డలి పార్టీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఒకే అబద్ధాన్ని పదేపదే ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శాప్ కార్యాలయం వద్ద అల్లర్లకు పాల్పడిన వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హోంమంత్రి స్పష్టం చేశారు. అందరిపైనా కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భావితరాలకు మార్గదర్శకులైన ఉపాధ్యాయులపై దాడులు చేయడం హేయమని, అలాంటి వారికి ప్రజాస్వామ్యంలో చోటు ఉండదని అనిత వ్యాఖ్యానించారు.

## ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు స్థానం లేదు




-మొదటిపేజీ తరువాయి

పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయుల జోలికి వైఎస్సార్సీపీ రావడం మానుకోవాలని లోకేశ్ హెచ్చరించారు. వైఎస్సార్సీపీ ప్రేరేపిత రౌడీ షీటర్లు, గంజాయి- బ్లేడ్ బ్యాచుల పని పడతామని తేల్చిచెప్పారు. అందరూ దైవంలా భావించే గురువులను వైన్‌షాపులకు కాపలాగా పెట్టిన జగన్ ఉపాధ్యాయులను గౌరవిస్తారని అనుకోవడం భ్రమేనని విమర్శించారు. అత్యుత్తమ ఆటతీరుతో రాష్ట్ర, దేశ ప్రతిష్ఠను ప్రపంచానికి చాటిన క్రీడాకారులపై స్పోర్ట్స్ కోటా అవకతవకల పేరుతో ఫేక్ ఆరోపణలు చేయడం ద్వారా జగన్ దుర్బుద్ధి బయటపడిందన్నారు. వైఎస్సార్సీపీ రౌడీ షీటర్లకు సంబంధించిన వీడియోను ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు.

శాప్ కార్యాలయం వద్ద వైఎస్సార్సీపీ నేతల అల్లర్లను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. దేవినేని అవినాష్, జోగి రమేష్ రౌడీ గ్యాంగులతో శాప్ కార్యాలయం వద్ద రాళ్లు, కోడిగుడ్లతో అల్లర్లకు పాల్పడ్డారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాన్ని చుట్టుముట్టి ఉపాధ్యాయులపై దాడికి యత్నించడం హేయమైన చర్య అని మండిపడ్డారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్లపై దౌర్జన్యం చేయడం దుర్మార్గమన్నారు. కష్టపడి ఉద్యోగాలు సాధించిన క్రీడాకారులు, ఉపాధ్యాయులను అవమానించడం సరికాదని మంత్రి హితవు పలికారు.

ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య పద్ధతి కాదని అన్నారు. శాంతియుతంగా తమ సమస్యలను చెప్పుకునే అవకాశం ఉన్నా, ప్రభుత్వ కార్యాలయం వద్ద ఉద్రిక్తత సృష్టించడం తగదని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద అల్లర్లు, దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం వైఎస్సార్సీపీ నేతల విజ్ఞతకే వదిలేస్తున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు.

### విష సంస్కృతి మరోసారి బయటపడింది

చదువు చెప్పే టీచర్లపై దాడులతో వైఎస్సార్సీపీ మరోసారి తన విష సంస్కృతిని బయటపెట్టిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండిపడ్డారు. ఎన్నో సవాళ్లను అధిగమించి డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు కల్పించడాన్ని వైఎస్సార్సీపీ ఓర్వలేకపోతోందని విమర్శించారు. ఉపాధ్యాయులంటే జగన్‌కు గిట్టదు కాబట్టే గతంలో వారిని మద్యం దుకాణాల ముందు కాపలా పెట్టారని ఆరోపించారు. ఇప్పుడు అదే ఉపాధ్యాయులపై రౌడీ మూకలతో దాడులు చేయించడం దురదృష్టకరమన్నారు. ఘటనకు బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి దాడులను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. శాప్ కార్యాలయం ముట్టడికి వైఎస్సార్సీపీ నేతలు ప్రయత్నించడంపై మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఉందని, అయితే భౌతిక దాడులకు ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేశారు. కష్టపడి ఉద్యోగాలు సాధించిన టీచర్లపై దాడులకు పాల్పడటం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడంతో పాటు కుటుంబాలను మానసిక క్షోభకు గురిచేయడం అత్యంత హేయమైన చర్యగా దుయ్యబట్టారు. ఇంకా తామే అధికారంలో ఉన్నామనే భ్రమలో వైఎస్సార్సీపీ నేతలు వ్యవహరిస్తున్నారని, ప్రజలను రెచ్చగొట్టి ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టి రాష్ట్రంలో ఉద్రిక్తతలు పెంచడమే వారి లక్ష్యంగా కనిపిస్తోందని విమర్శించారు. టీచర్లపై భౌతిక దాడులకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి ఘటనలను కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని మంత్రి స్పష్టం చేశారు.

### ఉపాధ్యాయులపై రాళ్లు, రాడ్లు, వాటర్ బాటిళ్లతో దాడి

వైఎస్సార్సీపీ నేతలపై మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించామని తెలిపారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వైఎస్సార్సీపీ నేతలు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులపై రాళ్లు, రాడ్లు, వాటర్ బాటిళ్లతో దాడి చేయడానికి సిగ్గుండాలన్నారు. శాప్ కార్యాలయంపై వైఎస్సార్సీపీ నాయకులు దాడి చేయడం అత్యంత హేయమని మండిపడ్డారు. రాష్ట్రంలో క్రీడాకారులని అవమానించడం, ఉద్యోగులని అవమానించడం జగన్ రెడ్డికి అలవాటుగా మారిపోయిందని దుయ్యబట్టారు. 5 సంవత్సరాలు ఉపాధ్యాయ ఉద్యోగాన్ని భర్తీ చేయని జగన్ రెడ్డి ఈరోజు డీఎస్సీ గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. 10వ తరగతి క్లాస్ పేపర్లు కొట్టేసినటువంటి వ్యక్తి జగన్ రెడ్డి అని దుయ్యబట్టారు. గొడ్డలి పార్టీ నాయకులు శాప్ కార్యాలయం మీద దౌర్జన్యానికి వెళ్లడం అనాగరికమన్నారు.

# తుపాను హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలి.





జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 21:** తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్ నుంచి మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తుపాను పరిస్థితుల పై సమీక్షించి, ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మానవ ప్రాణాలకు ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా అవసర మైన ముందస్తు చర్యలు చేపట్టాలని, తుపాను ప్రభావంతో దెబ్బతినే రహదారులు, డ్రైనేజీలు తదితర ప్రాంతాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆర్అండ్బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు రహదారుల పై ఉన్న గుంతలను గుర్తించి అవసర మైన మరమ్మతులు చేపట్టాలన్నారు.

సచివాలయ సిబ్బంది, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మండల రెవెన్యూ అధికారులు విత్తనాల నిల్వలను పరిశీలించి రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అత్యవసర సేవలకు సంబంధించిన వాహనాలు, సిబ్బంది ఫోన్ నంబర్లను సిద్ధంగా ఉంచాలని, ప్రతి మండలంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు సబ్‌స్టేషన్లను పరిశీలించి అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. డీజిల్, పెట్రోల్‌తో పాటు అత్యవసర వాహనాలకు అవసర మైన ఇంధనం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

తుపాను ప్రభావానికి ముందు, అనంతరం తీసుకోవాల్సిన నివారణ, ముందస్తు జాగ్రత్త చర్యలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. తుపాను అనంతరం రహదారులు, విద్యుత్ సరఫరా, కాలువలు, పారిశుద్ధ్య వ్యవస్థలను త్వరితగతిన పునరుద్ధరించేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. పీహెచ్‌సీలు, ఆసుపత్రుల్లో జనరేటర్లు, మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని, అత్యవసర చికిత్సలకు అవసర మైన మందులు, టీకాలు సరిపడా నిల్వలు ఉంచుకోవాలన్నారు. తుపాను పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, డిఆర్ఓ, వై. సత్యనారాయణ రావు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ఆసుపత్రిలో నూతన క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభం.

ప్రభుత్వ ఆసుపత్రులలో పేద ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించాలి.

కొణతాల రామకృష్ణ తో కలసి లాంఛనంగా ప్రారంభించిన జిల్లా కలెక్టర్.

**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 21:** పిఎం-ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎం - అభిమ్) పథకం కింద రూ. 22.25 కోట్ల వ్యయంతో నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌ను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి. నడ్డా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో గత వారంలో ప్రారంభించారు. ప్రజలకు అత్యవసర వైద్య సేవలను పూర్తి స్థాయిలో అందుబాటు లోకి తీసుకువచ్చేలా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తో కలసి, ప్రత్యేక పూజలు నిర్వహించి సోమవారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎన్టీఆర్ ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వివిధ రకాల వైద్య సేవలను గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ఆర్థోపెడిక్స్, జనరల్ సర్జరీ వంటి అత్యవసర వైద్య సేవలన్నింటినీ ప్రజలకు మరింత చేరువ చేసేలా తగిన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక శాసనసభ్యులు కొనతాల రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్య శాఖ, ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఈ నెల 17 న వర్చువల్‌గా ప్రారంభ మైన క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ) సేవలను స్థానికంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుబాటు లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం క్యాజువాలిటీ (అత్యవసర విభాగం) సేవలతో పాటు దాదాపు 10 ఐసీయు బెడ్లను ప్రజలకు అందుబాటు లోకి తీసుకొచ్చారన్నారు. రాబోయే రోజుల్లో సంపూర్ణ స్థాయి పరికరాలు, యంత్రాలు కేంద్రం నుండి రాగానే బెడ్ల సంఖ్యను 50 నుండి 60 వరకు పెంచనున్నట్లు తెలిపారు. ప్రధాన ఆసుపత్రి లోని ఓపీ సేవలు, అత్యవసర విభాగాలను వేరు చేయడం ద్వారా రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మెరుగైన వైద్యం అందిస్తారని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఇక్కడ ప్రత్యేక ఆక్సిజన్ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ ప్రణాళికలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి సి హెచ్ ఎస్., డా.శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.అచ్యుతకుమారి, వైద్యాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
















# గురజాడ సాహితీ సంపదను భావితరాలకు అందించాలి.





ఘనంగా మహాకవి 164 వ జయంతి వేడుకలు.

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబరు 21:** గురజాడ వేంకట అప్పారావు సాహిత్యం శాశ్వతంగా నిలిచి ఉంటుందని, ఈ సంపదను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయం విసీ హాల్ నందు మహాకవి 164 వ జయంతోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ, మన సంస్కృతిని, సంప్రదాయాలు, విలువైన సాహిత్యాన్ని సంరక్షించుకోవడంతో పాటు, భావితరాలకు అందించాలని అన్నారు. దేశమంటే మట్టి కాదోయ్...దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ కవిత, విశ్వవ్యాప్తంగా దేశభక్తికి ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఆయన రాసిన కన్యాశుల్కం గొప్ప సామాజిక స్పృహకు నిదర్శనంగా పేర్కొన్నారు. గురజాడ మానవత, సామాజిక దృక్పథం ప్రతిఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## స్కేటింగ్‌లో క్రైట్స్ విద్యా విహార్ విద్యార్థులు మెరుపు

- చిచ్చరపిడుగుల్లా దూసుకెళ్లి.. 13 పతకాలు
- క్రైట్స్ విద్యా విహార్‌కు జిల్లా స్థాయి గుర్తింపు



**అచ్యుతాపురం, పెన్ సత్తా, సెప్టెంబర్ 21:** ఎండ్యూరెన్స్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ 2026--27 స్కేటింగ్ పోటీల్లో క్రైట్స్ విద్యా విహార్ విద్యార్థులు విజేతను ఎగరవేశారు. గోపాలపట్నంలోని అల్వార్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో మొత్తం 13 పతకాలు సాధించారు. పి. జోసెఫ్, పి. జోషిత, పి. హర్షవర్ధన్ ఒక్కొక్క బంగారు పతకం సాధించారు. ఎ. అనూప్ రూబీనా రెండు, హర్షవర్ధన్ ఒక వెండి పతకం దక్కించుకున్నారు. సుధీక్ష, భరత్‌సాయి కార్తిక్, రిషి రూబెన్ ఒక్కొక్కటి, ఆశిరిత్ శ్రీయాన్ష్, ఎ. ఆశిష్ చెరో రెండు కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థుల విజయంపై పాఠశాల వ్యవస్థాపకులు రెడ్డి అప్పలనాయుడు, కరెస్పాండెంట్ రెడ్డి గణేష్, ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసన్న, డైరెక్టర్లు ప్రియాంక, రెడ్డి చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. స్కేటింగ్ కోచ్ రమేష్‌ను అభినందించారు. విద్యార్థులు క్రీడల్లో చదువుల్లో రాణించి ఉన్నతమైన విజయాలకు చేరుకోవాలని రెడ్డి గణేష్ తెలిపారు. నిరంతర సాధన, క్రమశిక్షణతో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

## ఎంపీ కప్ చదరంగం పోటీల్లో కళ్యాణి స్కూల్ విద్యార్థుల ప్రతిభ



**కవిటి పెన్ సత్తా, సెప్టెంబర్ 21::** ఎంపీ కప్ ఆధ్వర్యంలో నిర్వహించిన చదరంగం పోటీల్లో కళ్యాణి స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు.

ఈ పోటీల్లో కన్సోలేషన్ విభాగంలో సహస్ర మరియు సిద్ధార్థలు విజేతలుగా నిలిచి కల్యాణి పాఠశాలకు పేరు తీసుకువచ్చారు.ఎంతో ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీల్లో వందలాది మంది విద్యార్థులు పాల్గొనగా,కళ్యాణి స్కూల్ విద్యార్థులు తమ తెలివితేటలు,వ్యూహంతో విజయం సాధించడం అభినందనీయం.

విజేతలుగా నిలిచిన సహస్ర, సిద్ధార్థలను పాఠశాల కరస్పాండెంట్ కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోళ్ళ.రాజేష్, అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏవో బల్లెడ. రాణి,ప్రిన్సిపల్ బిందు. మాధవి,పిఈటి సతీష్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జాతీయ విపత్తుగా ప్రకటించి కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్లు విడుదల చేయాలి



**నక్కపల్లి పెన్ సత్తా, సెప్టెంబర్ 21:** అనకాపల్లి జిల్లా, ఎస్. రాయవరం మండలం గెడ్డపాలెం గ్రామంలో సిపిఎం రాష్ట్ర ప్రతినిధి వర్గం కరువు పరిస్థితి లు పరిశీలన చేయడానికి స్థానిక రైతులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం మాట్లాడుతూ రాష్ట్రంలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితిలు రీత్యా కరువు పరిస్థితి లు నెలకొని ఉన్నాయని, అదేవిధంగా అనకాపల్లి జిల్లా లో కరువు పరిస్థితి లు ఎలా ఉన్నాయని క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి పర్యటన చేస్తున్నామని తెలిపారు. అనకాపల్లి జిల్లా ఇరవై నాలుగు మండలాలలో అతి స్వల్ప వర్షపాతం పడిందని తెలిపారు.ప్రతీ సంవత్సరం ఒక లక్షా ముప్పై వేల ఎకరాల్లో వరి పంట వేయాల్సి ఉండగా ఈ సంవత్సరం కేవలం 12,500 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేసారు అవి కూడా పూర్తిగా పండే అవకాశం ఉండదని తెలిపారు.

వేయాల్సిన పంటలు కంటే యాభై శాతం కంటే అతి తక్కువ పంటలు వేసారు ఇది కరువు ప్రాంతం గా ప్రకటించడానికి ఉండవలసిన పరిస్థితి లు నెలకొని ఉన్నాయి. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని వెంటనే కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్లు రూపాయలు విడుదల చేసే విధంగా వత్తిడి తేవాలని కోరారు. కరువు నివారణ చర్యలు చేపట్టాలి రైతుల వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలి, కొత్తగా రుణాలు ఇవ్వాలి, తేలికపాటి పంటలు వేసే విధంగా రైతులను ప్రోత్సాహించాలి,ప్రతీ ఎకరాకు రైతు కు పదివేల రూపాయలు పరిహారంగా ఇవ్వాలి. రైతులకు, కూలీలకు రోజులతో సంబంధం లేకుండా ఉపాధి పనులు కల్పించాలి,కూలీ వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు ఎం.సూర్యనారాయణ,వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, ఆర్.శంకరరావు, జిల్లా నాయకులు జీ.నాయనబాబు,ఎం.సత్యనారాయణ,ఎం.రాజేష్ , జోగారావు తదితరులు పాల్గొన్నారు

# లోకల్ పోల్స్ కు కాంగ్రెస్ రెడీ...



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని పూర్వవైభవం సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సారథ్యంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పునర్నిర్మించే క్రమంలో 10 మంది సీనియర్ నేతలతో కూడిన రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ని ఏర్పాటు చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ కమిటీకి సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ పీసీసీ చీఫ్ ఎన్. రఘువీరారెడ్డిని ఛైర్మన్‌గా, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలంను కన్వీనర్‌గా నియమించడం ద్వారా కాంగ్రెస్ తన పాత కాపులను, అనుభవజ్ఞులను మళ్లీ ప్రధాన స్రవంతిలోకి తెచ్చేందుకు తగిన వేదికను సిద్ధం చేసింది. ఈ తాజా నియామకాల్లో ప్రధానంగా ఆకట్టుకుంటున్న అంశం రఘువీరారెడ్డి రీ-ఎంట్రీ. రాష్ట్ర విభజన అనంతరం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని నడిపిన ఆయన, గత కొంతకాలంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక, వ్యవసాయ కార్యక్రమాలకే పరిమితమయ్యారు. అయితే, రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత నాయకుడిగా, సౌమ్యుడిగా ఆయనకున్న మంచి పేరును వాడుకోవాలని ఏఐసీసీ భావించింది. బీసీ, యాదవ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేతగా, ఉమ్మడి ఏపీలో కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించిన రఘువీరారెడ్డి నాయకత్వం.. సైలెంట్‌గా ఉన్న పాత కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉంది. ఈ 10 మంది సభ్యుల కమిటీ ప్రాథమిక విధి కేవలం టికెట్ల కేటాయింపు లేదా కార్యాలయ వ్యవహారాలకే పరిమితం కాదు. సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, తులసిరెడ్డి, షేక్ మస్తాన్ వలి వంటి దిగ్గజాలతో కూడిన ఈ బృందం త్వరలోనే జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టనుంది. గత కొన్నేళ్లుగా వైసీపీ, టీడీపీల వైపు వెళ్లిన ద్వితీయ శ్రేణి నేతలను, కాంగ్రెస్‌తో అనుబంధం ఉన్న పాత కుటుంబాలను పరామర్శించడం, తీవ్ర అసంతృప్తితో ఉన్న క్షేత్రస్థాయి శ్రేణులను తిరిగి సొంత గూటికి రప్పించడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. రాజకీయ సమీకరణాల పరంగా చూస్తే, ప్రస్తుతం ఏపీలో తీవ్రమైన అధికార-ప్రతిపక్ష పోరు నెలకొంది. ఓవైపు వైఎస్ఆర్‌సీపీ తమ అభ్యర్థులను నిలబెట్టేందుకు కష్టపడుతున్న తరుణంలో, మరోవైపు కూటమి ప్రభుత్వంపై ఉండే సహజ వ్యతిరేకతను లేదా తటస్థ ఓటు బ్యాంకును ఆకర్షించడానికి కాంగ్రెస్‌కు ఇది అనుకూల సమయం. స్థానిక సంస్థల పోరులో పంచాయతీ, మండల, మున్సిపల్ స్థాయిలో బహుముఖ పోటీని సృష్టించడం ద్వారా, రాష్ట్రంలో కనీసం 10 నుండి 15 శాతం ఓటు బ్యాంకును తిరిగి సాధించవచ్చని పార్టీ అంచనా వేస్తోంది. వైఎస్సార్ వారసత్వం కార్డ్‌ను షర్మిల వాడుతుండగా, పాత కాంగ్రెస్ పునాదుల ను రఘువీరా బృందం బలోపేతం చేసే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ బాటలో సవాళ్లు తక్కువగానేమీ లేవు. క్షేత్రస్థాయిలో పార్టీకి ఆర్థికంగా, అంగబలంతో అండగా నిలిచే నాయకత్వం దాదాపు కనుమరుగైంది. ఎన్నికల నిర్వహణ వ్యయం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, గెలుపు గుర్రాలను వెతికి పట్టుకోవడం ఈ కమిటీకి అతిపెద్ద అగ్నిపరీక్ష. అలాగే రఘువీరారెడ్డి సుదీర్ఘ విరామం తర్వాత క్షేత్రస్థాయిలో ఎంతవరకు పర్యటించి, నేతలలో ఆత్మవిశ్వాసాన్ని నింపగలరనేది కూడా కీలకం. ఏది ఏమైనా, సరైన వ్యూహం లేకుండా ఎన్నికలకు వెళ్లే విధానానికి స్వస్తి పలికి, ముందుగానే పక్కా కసరత్తు ప్రారంభించడం కాంగ్రెస్ సాధించిన సానుకూల పరిణామంగానే చెప్పాలి. రఘువీరారెడ్డి నేతృత్వంలోని ఈ హైపవర్ కమిటీ ఏపీ కాంగ్రెస్‌కు ఎంతవరకు సంజీవని గా మారుతుందో వేచి చూడాలి. అధికారంలో ఉన్న కూటమిని, ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్ఆర్‌సీపీని తట్టుకుని స్థానిక పోరులో స్థానాలు గెలుచుకుంటేనే 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఏపీలో కాంగ్రెస్ పునరుజ్జీవనానికి పునాది పడుతుంది.

# జనసేన తీర్థానికి వైఎస్ఆర్‌సీపీ సీనియర్ల దూరమా?



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ప్రాధాన్యం క్రమంగా తగ్గుతున్న క్రమంలో, ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు గుడ్‌బై చెబుతూ కొత్త దారులు వెతుక్కుంటున్నారు. విజయనగరం జిల్లా జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్ఆర్‌సీపీకి రాజీనామా చేసిన వెంటనే నేరుగా టీడీపీ గూటికి చేరడం చర్చనీయాంశం అయింది. ప్రతిపక్షం నుంచి బయటకు వస్తున్న నేతలకు కూటమి రూపంలో రెండు వేదికలు అందుబాటులో ఉన్నప్పటికీ, మెజారిటీ నాయకులు జనసేన వైపు చూడకుండా కేవలం తెలుగుదేశం వైపే మొగ్గు చూపడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం జనసేనలో చేరిన తర్వాత లభిస్తుందనుకున్న ప్రాధాన్యత పై రాజకీయ నేతలకు ఉన్న అనుమానాలే. వైఎస్ఆర్‌సీపీ నుంచి బయటకు వచ్చి జనసేన తీర్థం పుచ్చుకున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. రాయలసీమ , ప్రకాశం జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న బాలినేని వంటి సీనియర్ నేత జనసేనలో చేరినప్పటికీ, ఆయనకు క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత లభించడం లేదనే అభిప్రాయం ఉంది. పైగా ఒంగోలు పరిసర నియోజకవర్గాల్లో కూటమి భాగస్వామి అయిన టీడీపీ స్థానిక నేతలతో బాలినేనికి తరచూ విభేదాలు రావడం, కూటమి శ్రేణుల మధ్య ఘర్షణలు వాతావరణం నెలకొనడం వంటివి ఆయనకు మరింత ఇరకాటంగా మారాయి. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ విషయంలో అనుసరిస్తున్న కఠినమైన ఫిల్టరింగ్ విధానం కూడా ఈ వలసల వేగాన్ని తగ్గించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలోకి వచ్చే వారి విషయంలో పవన్ జాగ్రత్తలు వహిస్తున్నారు. గతంలో జనసేనను, పవన్ కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా తీవ్రస్థాయిలో విమర్శించిన వైఎస్ఆర్‌సీపీ నేతలను, ,నియోజకవర్గాల్లో వివాదాస్పద ఇమేజ్ ఉన్న వారిని పార్టీలోకి చేర్చుకోవడానికి ఆయన సుముఖంగా లేరు. దీంతో పార్టీలోకి రావాలని ఆశపడే నేతలకు కనీసం గ్రీన్ సిగ్నల్ కూడా లభించని పరిస్థితి నెలకొంది. అధికారిక ప్రాధాన్యత , నియోజకవర్గాల్లో పట్టు సాధించే క్రమంలో టీడీపీయే సరైన వేదిక అని జంపింగ్ నేతలు భావిస్తున్నారు. పాత వైఎస్ఆర్‌సీపీ నేతలకు నియోజకవర్గ స్థాయి వ్యవస్థలపై, అధికారులపై ప్రభావం చూపగలిగే బలమైన కేడర్ అవసరం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీకి గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు బలమైన యంత్రాంగం ఉంది. జనసేన ఓటు బ్యాంకు బలమైనదే అయినప్పటికీ, నియోజకవర్గంలో రాజకీయం నడపాలంటే టీడీపీ అధికారిక చత్రం కింద ఉండటమే రక్షణ అని సీనియర్ నాయకులు లెక్కింపులు వేస్తున్నారు. జనసేన అంతర్గత నిర్మాణం, నిర్ణయాల ప్రక్రియ కూడా ఇక్కడ ఒక అంశంగా మారింది. పవన్ కళ్యాణ్ చుట్టూ ఉన్న కోటరీ , పరిమితమైన పార్టీ పదవుల కేటాయింపు వల్ల, కొత్తగా చేరే వైఎస్ఆర్‌సీపీ మాజీ సీనియర్లకు సముచిత స్థానం దక్కుతుందా లేదా అనే సంశయం ఉండిపోయింది. బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతాన్ని చూసిన తర్వాత చాలామంది వైఎస్ఆర్‌సీపీ సీనియర్లు జనసేనలోకి వెళ్లి మూలన పడేకంటే, నేరుగా టీడీపీలోకి వెళ్లి తమ ఉనికిని చాటుకోవడమే మేలు అనే ముగింపునకు వచ్చినట్లు కనిపిస్తోంది. ఈ పరిణామాలు క్షేత్రస్థాయిలో జనసేన విస్తరణకు కొంత అడ్డంకిగా మారినప్పటికీ, స్వచ్ఛమైన ఇమేజ్ ఉన్నవారినే పార్టీలోకి తీసుకోకూడదనే పవన్ కళ్యాణ్ వ్యూహం సుదీర్ఘకాలంలో పార్టీ సిద్ధాంతానికి మేలు చేస్తుందని జనసేన వర్గాలు వాదిస్తున్నాయి. అయితే, ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ బలహీనపడుతున్న ఈ కీలక సమయంలో వలసొచ్చే బలమైన నేతలను ఆకర్షించడంలో జనసేన వెనుకబడితే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని నిర్మించుకోవడం ఆ పార్టీకి అతిపెద్ద సవాలుగా

# కల్తీ నెయ్యి... అడ్డంగా దొరికినట్టేనా

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెల్లడించిన దర్యాప్తు వివరాలను పట్టుకుని వైఎస్సార్‌సీపీ చేస్తున్న ప్రచారం ఆ పార్టీకే రాజకీయంగా, నైతికంగా తీవ్రమైన సెల్ఫ్ గోల్‌గా మారుతోంది. సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లాను అరెస్ట్ చేసిన ఈడీ.. టీటీడీకి సరఫరా చేసిన నెయ్యిలో పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్, ఎంజీ-90, మైవాసెట్ సాఫ్ట్ 400 వంటి ప్రమాదకర రసాయనాలు కలిపారని స్పష్టం చేసింది. అయితే, ఇందులో జంతు కొవ్వు ప్రస్తావన లేదన్న ఒకే ఒక్క పాయింట్‌ను పట్టుకుని, చూశారా మేం జంతు కొవ్వు వాడలేదు, మాపై తప్పుడు ఆరోపణలు చేశారు అంటూ వైసీపీ నేతలు సంబరాలు చేసుకోవడం, ఊరట పొందుతున్నట్లు ప్రకటనలు విడుదల చేయడం తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది. ఈ రకమైన సమర్థన ద్వారా ఐదేళ్ల తమ హయాంలో తిరుమలకు నకిలీ, విష రసాయనాల నెయ్యి సరఫరా జరిగిందన్న దారుణ సత్యాన్ని వైఎస్సార్‌సీపీ పరోక్షంగా నూటికి నూరు శాతం అధికారికంగా అంగీకరించినట్లయింది. ప్రాథమికంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అనేది ఒక ఆర్థిక నేరాల దర్యాప్తు సంస్థ మాత్రమే. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ పరిధిలో అక్రమ నగదు లావాదేవీలు, డొల్ల కంపెనీలు, కల్తీ సరుకు కొనుగోళ్ల ముసుగులో జరిగిన నిధుల మళ్లింపును నిగ్గుతేల్చడమే దాని పని. నెయ్యిలో జంతు కొవ్వు ఉందా, లేదా అనేది తేల్చాల్సింది ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ , ప్రత్యేక ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లు, కోర్టు పరిధిలోని సిట్ దర్యాప్తు మాత్రమే తప్ప, అది ఈడీ పరిధిలోని అంశం కాదు. అలాంటప్పుడు ఈడీ రిపోర్టులో జంతు కొవ్వు పేరు రాలేదని సంబరాలు చేసుకోవడం ప్రజల దృష్టిని మళ్లించే కుట్రే. ఈడీ మోపిన 230 కోట్ల అక్రమ దందా, ఫేక్ రికార్డులు, విషపూరిత కెమికల్స్‌తో కూడిన తయారీ ఆరోపణలను వైసీపీ పూర్తిగా ఒప్పేసుకున్నట్లే అవుతోంది. భారతీయ సంస్కృతిలో, హిందూ ధర్మంలో తిరుమల వేంకటేశ్వర స్వామికి సమర్పించే నైవేద్యం పవిత్రమైనది. దేశవిదేశాల నుంచి కోట్ల మంది భక్తులు పరమ భక్తితో స్వీకరించే లడ్డూ ప్రసాదంలో ఆవు నెయ్యి స్థానంలో రీఫైన్డ్ పామాయిల్, మోనోగ్లిజరైడ్స్ వంటి పారిశ్రామిక రసాయనాలను కలిపి అంటగట్టడం కలియుగ దైవానికి చేసిన క్షమించరాని మహాపచారం కాదా? మేము విష రసాయనాలు మాత్రమే వాడాము తప్ప జంతు కొవ్వు వాడలేదని వాదించడం ఎంతటి దిగజారుడుతనం? కల్తీ జరిగిందని నిర్ధారణ అయినప్పుడు, అది ఏ రూపంలో ఉన్నా భక్తుల మనోభావాలను, దైవ పవిత్రతను తీవ్రంగా దెబ్బతీసిన ఘోర నేరమే అవుతుంది. మనీలాండరింగ్ కోణంలో 230 కోట్ల కుంభకోణం జరిగిందని, అందులో 96 కోట్ల విలువైన కల్తీ రసాయన నెయ్యి ఒక్క కంపెనీ నుంచే సరఫరా అయిందని ఈడీ తేల్చింది. పాల సేకరణే లేని ఫ్యాక్టరీల నుంచి ట్యాంకర్ల కొద్దీ కెమికల్ లిక్విడ్ తిరుమల కొండపైకి చేరుతుంటే అప్పటి పాలకమండలి పెద్దలు ఏం చేస్తున్నారు? ఈ అక్రమ రవాణాలో టీటీడీ అధికారులకు, రాజకీయ పెద్దలకు అందిన ముడుపుల మాటేమిటి? శ్రీవారి భక్తుల మనోభావాలతో చెలగాటమాడి, ఆరోగ్యాన్ని పణంగా పెట్టి వేల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన ఈ ముఠాకు చట్టపరంగా పడే సాధారణ శిక్షలు సరిపోవు.

రూ.230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కోసం ఏకంగా రూ.230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకటించిది. ఇది కేవలం వ్యాపారుల స్వార్థం మాత్రమే ఉందంటే సామాన్యులు కూడా నమ్మే పరిస్థితి లేదు. సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లా, భోలే బాబా డెయిరీ విపిన్ జైన్ వంటి వ్యాపారులు నెయ్యి స్థానంలో పామాయిల్, కెమికల్స్ కలిపారన్నది సాంకేతిక ఆధారాలతో తేలింది. కానీ, నిత్యం కఠిన నిబంధనలు, ల్యాబ్ టెస్టులు, సెక్యూరిటీ ఉండే తిరుమల వంటి పరమ పవిత్ర పుణ్యక్షేత్రంలోకి ఏళ్ల తరబడి ఎలాంటి అడ్డంకులు లేకుండా ట్యాంకర్ల కొద్దీ విషపూరిత నెయ్యి ప్రవేశించిందంటే.. కచ్చితంగా త్యున్నత రాజకీయ అండదండలు లేకుండా ఇది సాధ్యమయ్యే పనేనా ?ఈ ప్రశ్నకు మరింత బలాన్ని చేకూరుస్తోంది టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు కడూరు చిన్న అప్పన్న వ్యవహారం. నెయ్యి సరఫరా చేసే డెయిరీ కాంట్రాక్టర్ల వద్ద కిలో నెయ్యికి 25 చొప్పున కమీషన్ డిమాండ్ చేశారన్న అభియోగాలతో ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం అప్పన్నను ఏ-24గా అరెస్ట్ చేసి జైలుకు పంపింది. లంచం ఇవ్వడానికి నిరాకరించిన డెయిరీలను నిబంధనల పేరుతో బెదిరించి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టించడం, కమీషన్లు ముట్టజెప్పిన కంపెనీలకు రేట్లు పెంచి కాంట్రాక్టులు కట్టబెట్టడం, హవాలా ద్వారా కోట్లాది రూపాయల ముడుపులు అందుకోవడం వంటి అంశాలపై సిట్ ఆధారాలు సేకరించింది. పూరి గుడిసె నేపథ్యం ఉన్న ఒక సాధారణ పీఏ ఖాతాల్లోకి, బినామీ ఆస్తుల్లోకి కోట్ల రూపాయల నిధులు ఎలా చేరాయన్నది ఈ వ్యవహారంలో అసలు గుట్టును బయటపెడుతోంది.

**చైర్మన్ పీఏ ... చైర్మన్ చెప్పకుండా చేయగలడా?**

అయితే ఇక్కడే అసలైన రాజకీయ, పరిపాలనాపరమైన ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక చైర్మన్ పీఏ స్థాయి వ్యక్తి ఇంతటి మెగా కుంభకోణాన్ని సొంత పూచీకత్తుతో నడిపించగలడా? డెయిరీలను బెదిరించడం, టీటీడీ కొనుగోలు విభాగం అధికారులను ఆదేశించడం, టెండర్లలో నిబంధనలు మార్చేలా ఒత్తిడి తేవడం ఆయన ఒక్కడి వల్లే అయ్యే పనేనా? వైవీ సుబ్బారెడ్డి పేరును, ఆయన అధికారాన్ని వాడుకోకుండా బోర్డు పరిధిలోని వ్యవహారాలను ఒక పీఏ శాసించడం అసాధ్యమనేది బహిరంగ రహస్యం. గతంలో కల్తీ గురించి ఫిర్యాదులు, ల్యాబ్ నివేదికలు వచ్చినా బుట్టదాఖలు కావడం వెనుక తిరుమల పాలకమండలి పెద్దల మౌనమే రక్షణ కవచంగా నిలిచిందన్న విమర్శలు బలంగా ఉన్నాయి. ప్రస్తుతం సిట్ అప్పన్నను అదుపులోకి తీసుకుని విచారించగా, ఈడీ మాత్రం కైలాష్ మంగ్లా, విపిన్ జైన్ వంటి తయారీదారులను అరెస్ట్ చేస్తూ పీఎంఎల్ఏ చట్టం కింద మనీ ట్రయల్ ను ఛేదిస్తోంది. కల్తీ నెయ్యి వ్యాపారులు సృష్టించిన నల్లధనం ఎవరెవరి ఖాతాల్లోకి వెళ్లింది, ఎవరికి కమీషన్లుగా ముట్టింది అనే బ్యాంకింగ్, హవాలా లింకులు బయటకు వస్తే.. ఆ దర్యాప్తు ముగింపు అప్పన్న వద్దే ఆగిపోవడం అసాధ్యం. అప్పన్న ద్వారా ఆ ముడుపులు ఎవరి గడప దాటాయి, టీటీడీ అప్పటి ఉన్నతాధికారులు, బోర్డు చైర్మన్ కార్యాలయానికి దీనితో ఉన్న లంకె ఏమిటన్నది తేలక తప్పదు.

## 100 శాతం స్ట్రైక్ రేటుపై గురి

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి జనసేన పార్టీ అత్యంత పకడ్బందీ వ్యూహాన్ని రచిస్తోంది. పొత్తుల రాజకీయంలో సీట్ల సంఖ్య కోసం వెంపర్లాడే సాంప్రదాయ ధోరణికి భిన్నంగా.. పోటీ చేసిన ప్రతిచోటా గెలిచి తీరాలనే దృఢ నిశ్చయంతో అడుగులు వేస్తోంది. విశాఖపట్నంలో జరిగిన పార్టీ ఆత్మీయ సమావేశంలో పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు జనసేన క్షేత్రస్థాయి వ్యూహాన్ని స్పష్టం చేశాయి. మనం తీసుకునే ప్రతిదీ గెలిచే సీటే తీసుకుందాం. కేడర్ నుంచి ఒత్తిడి ఉంది కదా అని గుడ్డిగా 60, 70 లేదా 120 సీట్లు తీసుకోము అని తేల్చిచెప్పడం ద్వారా.. సీట్ల సంఖ్య కంటే గెలుపు గుర్రాలపైనే పార్టీ పూర్తి దృష్టి పెట్టిందన్న స్పష్టమైన సంకేతాన్ని శ్రేణులకు ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ, 2 ఎంపీ స్థానాల్లో పోటీ చేసి 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించిన రికార్డును స్థానిక సమరంలోనూ పునరావృతం చేయడమే పార్టీ ప్రధాన అజెండాగా కనిపిస్తోంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్ర నిర్బంధాలు, బెదిరింపులను ఎదుర్కొంటూనే విశాఖ కార్పొరేషన్‌లో 3 వార్డులు గెలవడంతో పాటు 7 చోట్ల రెండో స్థానంలో నిలిచిన చరిత్రను పార్టీ గుర్తుచేసుకుంటోంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాలనాపరమైన పనితీరు ప్రజల్లో సానుకూలతను పెంచిన వేళ.. క్షేత్రస్థాయిలో పార్టీకి తిరుగులేని పట్టున్న వార్డులు, డివిజన్లను గుర్తించి అక్కడ మాత్రమే పూర్తి బలంతో బరిలోకి దిగాలని అధినాయకత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. కూటమిలో భాగస్వామిగా ఉంటూ అనవసర డిమాండ్లతో సమన్వయాన్ని దెబ్బతీయకుండా, వాస్తవ బలాబలాల ఆధారంగానే సీట్ల సర్దుబాటు ఉండాలనేది జనసేన లైన్. ఏదో ప్రభావం చూపే స్థానంలో ఉన్నాం కదా అని మిత్రపక్షాలపై ఒత్తిడి తెచ్చి ఎక్కువ సీట్లు తీసుకోవడం.. ఆ తర్వాత సమన్వయం లేక లేదా అభ్యర్థుల బలహీనత వల్ల చేజేతులా ఓడిపోవడం వంటి తప్పులకు జనసేన తావివ్వదలుచుకోలేదు. స్థానిక సమస్యలపై పట్టు, ప్రజల్లో నిరంతరం ఉండే నాయకత్వం, గెలిచే సత్తా ఉన్న అభ్యర్థులు ఉన్న చోట మాత్రమే కూటమి తరఫున జనసేన సీట్లను క్లెయిమ్ చేయాలని నిర్ణయించింది. ఇది అటు కూటమి ఐక్యతను కాపాడటంతో పాటు, ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీకి ఏ ఒక్క స్థానంలోనూ పట్టు చిక్కకుండా చేసే వ్యూహాత్మక ఎత్తుగడ. పార్టీ శ్రేణులకు నాయకత్వం ముందస్తు హెచ్చరికలు కూడా జారీ చేసింది. టికెట్ రాగానే గెలిచేసినట్లు భావించే అతివిశ్వాసం వద్దని, సోషల్ మీడియాలో వచ్చే అనవసర ప్రచారాలు, సీట్ల సంఖ్యపై సాగే చర్చలను పట్టించుకోవద్దని తేల్చిచెప్పింది. అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయమే తుది నిర్ణయమని, పార్టీ ఎక్కడ పోటీ చేసినా అక్కడ జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. సంఖ్యతో కూడిన డాంబికాల కంటే.. పోటీ చేసిన ప్రతి స్థానంలోనూ విజయకేతనం ఎగురవేసి అన్‌బీటెన్ బ్రాండ్‌ను కాపాడుకోవడమే జనసేన అసలైన స్థానిక మంత్రంగా కనిపిస్తోంది.

# పవన్ ఏం చెబుతారో... సర్వత్రా ఉత్కంఠ !



జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ నెల 22న కాకినాడ వేదికగా కీలకమైన పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జరుగుతోంది. దాంతో స్థానిక ఎన్నికల విషయంలో జనసేన వ్యూహాలు ఏమిటి ఆ పార్టీ పోటీ చేసే సీట్లు ఎన్నికల పొత్తులలో వ్యవహరించే విధానం మీద అంతటా ఆసక్తి అయితే ఉంది. ఎందుకంటే 2024 ఫార్ములాను జనసేన నేతలు ఇప్పటికే కాదు కూడదని చెప్పారని అంటున్నారు. అంతే కాదు 30 శాతం సీట్లు తమకు దక్కాలని కోరుకుంటున్నారు అని కూడా ప్రచారంలో ఉంది. అయితే అదే సమయంలో జనసేన అగ్ర నేత మంత్రి నాదెండ్ల మనోహర్ విశాఖలో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడుతూ బలం ఉన్న చోటనే జనసేన పోటీ పడాలని సూచించినట్లుగా వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఈ కీలక సమావేశం మీద అందరి ఫోకస్ ఉందిపుడు.

**తీవ్ర అసంతృప్తితో :**

ఇదిలా ఉంటే నాదెండ్ల మనోహర్ బలం ఉన్న చోట పోటీ పడాలని బాధ్యత కలిగిన పార్టీగా జనసేన వ్యవహరించాలని సూచించినట్లుగా ప్రచారం సాగింది. దీని మీద జనసైనికులు అయితే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు అని అంటున్నారు. ఎందుకంటే ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని చాలామంది పెద్ద ఎత్తున ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ తరహా ప్రకటనలు వారి ఆశల మీద నీళ్ళు చల్లుతున్నాయి. దాంతో ఈ పరిణామాల నేపథ్యంలో జనసేన అధినేత పవన్ వెంటనే ఒక అతి ముఖ్య సమావేశం ఏర్పాటు చేయడంతో పవన్ ఏమి చెబుతారు అన్నది అయితే చర్చకు వస్తోంది.

**పవన్ డెసిషన్ అంటే :**

ఇక చూస్తే పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ అధినేత హోదాలో ఏది చెప్పినా అదే ఫైనల్ అని అంటున్నారు. ఈసారి ఎక్కువ సీట్లు తీసుకుని కూటమితో కలసి పోటీ చేస్తామని పవన్ కనుక ప్రకటిస్తే ఆ లెక్క వేరే ఉంటుందని అంటున్నారు. ఎందుకంటే దశాబ్దం పైగా జనసేన నాయకులు కానీ క్యాడర్ కానీ పార్టీ కోసం ఎంతగానో శ్రమించారు అని ఇప్పుడు వారికి గ్రౌండ్ లెవెల్ లో అధికారం అందుకునే చాన్స్ వచ్చిందని అంటున్నారు. అదే విధంగా పార్టీలో క్షేత్ర స్థాయిలో ఆశలు ఆకాంక్షలకు పవన్ నిర్ణయాలు ప్రతిబింబిస్తాయని కూడా అనేక మంది భావిస్తున్నారు. అయితే జనసేన కూటమిలో అతి ముఖ్య భాగస్వామి. కాబట్టి ఆచీ తూచీ నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. దాంతో బాలెన్స్ గానే జనసేన విధానాలు కానీ ఆలోచనలు కానీ ఉంటాయని చెబుతున్నారు. అలా కనుక చూస్తే ఏ రకమైన తీర్మానం వెలువడుతుంది అన్నది కూడా ఉత్కంఠను రేపేదిగా ఉంటుందని అంటున్నారు.

**కందులకు బాధ్యతలు :**

మరో వైపు చూస్తే జనసేన పార్టీకి సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచార సారథ్యాన్ని కో ఆర్డినేట్ చేసుకునే కీలక భూమికను మంత్రి కందుల దుర్గేష్ కి పవన్ అప్పగించారు. దీంతో ఆయన మీద మరింత కొత్త భారాలు పెరిగాయని అంటున్నారు. సౌమ్యుడిగా ఉంటూ అందరికీ కలుపుకుని పోయే కందులకు జనసేన ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ గాబాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీలో హర్షం వ్యక్తం అవుతోంది అని అంటున్నారు. అలాగే జనసేన శ్రేణులను ఏకమొత్తంగా ముందుకు నడిపించే సామర్థ్యం ఆయనకు ఉందని అంటున్నారు. మొత్తం మీద చూస్తే చాలా కాలం తరువాత స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట పవన్ కాకినాడలో తన పార్టీ శ్రేణులతో నిర్వహించే కీలక సమావేశం మీద జనసేన మాత్రమే కాదు ఏపీ రాజకీయ మొత్తం నిశితంగా చూస్తోంది అని అంటున్నారు.

# పర్యటనల వల్ల ఆర్థిక సంబంధాలకు రాజకీయ ఊతం

భారత్-న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం గురించి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కీలక ప్రకటన చేశారు. ఈ ఒప్పందం అక్టోబర్ 20 నుంచి (దసరా పండుగ రోజున) అమల్లోకి రానుందని వెల్లడించారు. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే న్యూజిలాండ్‌కు ఎగుమతి చేసే భారతీయ వస్తువులపై ఎలాంటి టారిఫ్‌లు ఉండవని స్పష్టం చేశారు. 100 శాతం సుంకం వెసులుబాటు లభిస్తుందని పేర్కొన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో గోయల్ ఈ విషయాన్ని ప్రకటించారు.

'భారత్- న్యూజిలాండ్ ద్వైపాక్షిక ఆర్థిక భాగస్వామ్యంలో మరో కీలక మైలురాయిని ముందుకు తీసుకెళ్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. అదే భారత్-న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలులోకి రావడం. ఈ ఒప్పందం 2026 అక్టోబర్ 20న అంటే దసరా పండగ శుభ సందర్భంలో అమల్లోకి వస్తుంది. బలమైన, మరింత ఉన్నత లక్ష్యాలతో కూడిన ఆర్థిక భాగస్వామ్యాన్ని నిర్మించడంలో భారత్, న్యూజిలాండ్ దేశాలకు ఉన్న ఉమ్మడి నిబద్ధతను ఈ పరిణామం ప్రతిబింబిస్తుంది. చర్చల సమయంలో న్యూజిలాండ్ వాణిజ్య మంత్రి మెక్‌క్లే గొప్ప సహకారాన్ని అందించారు. అలాగే న్యాయమైన, సమానమైన, సమతుల్యమైన ఒప్పందం కోసం కృషి చేసిన భారత్, న్యూజిలాండ్ చర్చల బృందాలకు అభినందనలు' అని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు.

ఈ ఏడాది జులైలో న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ భారత్‌లో పర్యటించడం, ప్రధాని నరేంద్ర మోదీ న్యూజిలాండ్‌ను సందర్శించడం వల్ల ఇరు దేశాల ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలకు బలమైన రాజకీయ ఊతం లభించిందని



పీయూష్ గోయల్ అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలు భారత్, న్యూజిలాండ్‌ల ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయని తెలిపారు. అలాగే ఎఫ్‌టీఏని త్వరగా అమలు చేయాల్సిన ప్రాముఖ్యతను నొక్కి చెప్పాయని పేర్కొన్నారు. వ్యూహాత్మక భాగస్వామ్యం, 2030 రోడ్‌మ్యాప్ సహా ఆర్థిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలనే భారత్, న్యూజిలాండ్‌లు ఉమ్మడి లక్ష్యంతో ఉన్నాయని అన్నారు. భారత్-న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలులోకి రావడం ద్వారా ఈ లక్ష్యాలు వాస్తవ ఆర్థిక ఫలితాలుగా మారుతాయని వివరించారు.

**ఇరుదేశాల ఎఫ్‌టీఏపై న్యూజిలాండ్ ప్రధాని హర్షం**

మరోవైపు భారత్, న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఫీూ) ఖరారైందని న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సర్ సోమవారం ప్రకటించారు. సెప్టెంబరు ప్రారంభంలో పార్లమెంట్ ఆమోదం తెలపడంతో ఈ డీల్ అక్టోబర్‌లో అమల్లోకి రానుందని స్పష్టం చేశారు. ఈ ఒప్పందం ఎగుమతిదారులకు మరిన్ని అవకాశాలను సృష్టిస్తుందని, వ్యాపార వృద్ధికి తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. అలాగే న్యూజిలాండ్‌లో మరిన్ని ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని, వ్యాపారులకు అధిక ఆదాయాలను అందిస్తుందని అన్నారు.

'దాదాపు మూడేళ్ల క్రితం ఎన్నికల్లో గెలిస్తే మా మొదటి పదవీకాలంలోనే భారత్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఫీూ) కుదుర్చుకుంటానని నేను హామీ ఇచ్చాను. నేడు ఆ ఒప్పందాన్ని ఖరారు చేశాం. ఈ డీల్ వచ్చే నెల (అక్టోబరు)లో అమల్లోకి రానుంది. ఈ ఎఫ్‌టీఏ వల్ల ఎన్ని వ్యాపారాలు వృద్ధి చెందుతాయో, అలాగే ఆ వ్యాపారాలకు, అందులో పనిచేసే వారికి, మొత్తం దేశానికి కలిగే ప్రయోజనాల గురించి ఆలోచించడం ఎంతో ఉత్సాహాన్నిస్తుంది. దీనివల్ల ఎగుమతిదారులకు మరిన్ని అవకాశాలు, వ్యాపారాలకు బలమైన వృద్ధి లభిస్తుంది' అని క్రిస్టోఫర్ లక్సన్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు.

**'కెనడాతో తదుపరి చర్చలు అక్టోబరు 5న'**

మరోవైపు, కెనడాతో సంబంధాల గురించి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (జజుూూ) కోసం చర్చలను వేగవంతం చేయడానికి భారత్, కెనడాలు అంగీకరించాయని వెల్లడించారు. తదుపరి విడత చర్చలు అక్టోబర్ 5న ప్రారంభం కానున్నాయని తెలిపారు. రాబోయే 90 రోజులు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలలో ఒక నిర్ణయాత్మక కాలం కాగలదని పేర్కొన్నారు. శుక్రవారం ముంబయిలో కెనడా వాణిజ్య శాఖ మంత్రి మనిందర్ సిద్ధూతో కలిసి ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై నాలుగో విడత చర్చలను పూర్తి చేసినట్లు చెప్పారు. చర్చలు ఫలప్రదంగా సాగాయని పేర్కొన్న గోయల్, చర్చల వేగాన్ని పెంచాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయని అన్నారు.

# సోనియా గాంధీకి దిల్లీ కోర్టు షాక్

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి దిల్లీ కోర్టు షాక్ ఇచ్చింది. 1983లో భారత పౌరసత్వం పొందేందుకు మూడేళ్ల ముందే సోనియా గాంధీ పేరును ఓటర్ల జాబితాలో చేర్చారన్న ఆరోపణపై విచారణకు నిరాకరిస్తూ గతంలో మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన రివిజన్ పిటిషన్‌ను అనుమతించింది. ఈ పిటిషన్?ను తిరిగి విచారణ చేపట్టాలంటూ దిల్లీ కోర్టు సోమవారం ఆదేశించింది. మేజిస్ట్రేట్ ఉత్తర్వును సరైన వివరణ లేనిదిగా పేర్కొంటూ ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే దానిని కొట్టివేశారు. రౌస్ అవెన్యూ కోర్టుల సెంట్రల్ దిల్లీ కోర్ట్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అడ్వకేట్ వికాస్ త్రిపాఠి ఈ పిటిషన్?ను దాఖలు చేశారు.

"భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 175(3)ను పాటించకపోవడం, ముఖ్యంగా సంబంధిత పోలీస్ అధికారి వాదనలు వినకపోవడం, సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి స్టేటస్ రిపోర్ట్ తెప్పించకపోవడం వంటి కారణాల వల్ల సదరు ఉత్తర్వులో చట్టపరంగా స్పష్టమైన లోపం ఉంది. చట్టం ప్రకారం ఉన్న రెండు మార్గాలను అంటే ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించడం లేదా ప్రత్యామ్నాయంగా బీఎన్ఎస్ఎస్ కింద విచారణ జరపడం వంటి అంశాలను మేజిస్ట్రేట్ పరిగణనలోకి తీసుకోనందున ఆ ఉత్తర్వులో ఎటువంటి వివరణా లేదని స్పష్టమవుతోంది." అని న్యాయమూర్తి అన్నారు.

**'ఆ చట్టపరమైన ప్రత్యామ్నాయాలను మెజిస్ట్రేట్ పరిశీలించలేదు'**



ఫిర్యాదులో గుర్తించదగిన నేరం జరిగినట్లు వెల్లడైందా లేదా అనే ప్రధాన అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండానే మేజిస్ట్రేట్ పౌరసత్వం అనే అంశం వైపు మళ్లారని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించడం లేదా దీఛీూ కింద ప్రొసీడింగ్స్ నిర్వహించడం అనే చట్టపరమైన ప్రత్యామ్నాయాలను మెజిస్ట్రేట్ పరిశీలించలేదని కోర్టు స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే తాజా వాదనలు విన్న న్యాయస్థానం కారణాలతో కూడిన ఉత్తర్వు జారీ చేయాలని మేజిస్ట్రేట్‌కు తిరిగి పంపింది. ఈ కేసు తదుపరి విచారణ కోసం సెప్టెంబర్ 29కి వాయిదా వేశారు. ఈ తీర్పును దిల్లీ కోర్టు తాజాగా పక్కనబెట్టడంతో దర్యాప్తునకు మార్గం సుగమం అయ్యింది.

**అసలు ఈ కేసు ఏంటంటే?**

కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ 1983లో భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే 1980లో ఓటర్‌గా రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపిస్తూ దిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు ఆమె ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించారని, ఆ వ్యవహారంలో ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్? కోరారు. 1983లో సోనియాకు భారత పౌరసత్వం వచ్చింది. 1980 నాటి ఓటర్ జాబితా అంటూ గతంలో బీజేపీ నేత అమిత్ మాలవీయ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. గాంధీ కుటుంబ సభ్యులైన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీతో పాటు సోనియా పేరును చేర్చారని అందులో పేర్కొన్నారు. అప్పటికీ ఆమె ఇంకా ఇటలీ పౌరసత్వం కలిగి ఉన్నారని చెప్పారు. అయితే దానిపై విమర్శలు రావడంతో 1982లో ఓటర్ జాబితా నుంచి ఆమె పేరు తొలగించారని, 1983లో మళ్లీ కనిపించిందని రాసుకొచ్చారు. అప్పుడు కూడా పౌరసత్వం రావడానికన్నా ముందే మళ్లీ జాబితాలోకి పేరు వచ్చి చేరిందని ఆరోపించారు. రాజీవ్‌ను వివాహమాడిన తర్వాత పౌరసత్వం రావడానికి 15 ఏళ్లు ఎందుకు పట్టిందని ఇక్కడ ప్రశ్నించడం లేదు. ముందే ఓటర్ జాబితాలో ఆమె పేరు కనిపించడం ఎన్నికల ప్రక్రియ దుర్వినియోగం కాకపోతే ఇంకేంటి?" అని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే దాఖలైన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది.

# మరో చైనా కారాదనే భారత్‌పై అమెరికా టార్గెట్!

పోఖ్రాన్ అణు పరీక్షల సమయంలో భారత్‌పై ఆంక్షలు విధించిన అమెరికా, మరోసారి అదే దారిలో పయనిస్తోంది. ఈసారి రష్యా నుంచి చౌకగా ముడిచమురు కొనుగోలు చేస్తోందనే సాకుతో ఏకంగా 100 శాతం టారిఫ్‌లు విధించేందుకు సిద్ధమైంది. అయితే అమెరికా అసలు ఉద్దేశం రష్యాను కట్టడి చేయడమా? లేక ఆసియాలో మరో ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారత్‌ను అడ్డుకోవడమా? ఈ ఒత్తిళ్లకు భారత్ తలొగ్గుతుందా? ఇప్పుడు తెలుసుకుందాం.

**రష్యా నుంచి ఇంధనం కొనే దేశాలపై 100 శాతం టారిఫ్ విధించే అధికారం**

భారత్‌పై అగ్రరాజ్యం అమెరికా మరోసారి ఆంక్షల అస్త్రాన్ని తెరపైకి తెచ్చింది. రష్యా నుంచి భారత్ ముడిచమురు కొనుగోలు చేయకుండా అడ్డుకోవడమే లక్ష్యమంటూ టారిఫ్‌ల పేరిట బెదిరింపులకు పాల్పడుతోంది. అయితే భారత్‌ను మరో చైనాలా మారనివ్వకూడదనే వ్యూహంతోనే వాషింగ్టన్ అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. 1998లో పోఖ్రాన్ అణు పరీక్షల సమయంలో భారత్‌పై అమెరికా ఆంక్షలు విధించగా, సరిగ్గా 25 ఏళ్ల క్రితం 2001 సెప్టెంబర్‌లో నాటి జార్జ్ బుష్ ప్రభుత్వం వాటిని ఎత్తివేసింది. కానీ 25 ఏళ్ల తర్వాత అమెరికా మళ్లీ భారత్‌పై చర్యలకు సిద్ధమైంది. యూఎస్ కాంగ్రెస్ ఉభయ సభల ఆమోదం పొందిన 'లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026'పై సెప్టెంబర్ 19న అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేశారు. దీని ప్రకారం రష్యా నుంచి ఇంధనం కొనే దేశాలపై 100 శాతం మేర టారిఫ్‌లు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి దక్కుతుంది. ఈ బిల్లు ప్రధాన లక్ష్యం రష్యా ఇంధనాన్ని అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న చైనా, భారత్‌లే అన్నది స్పష్టంగా అర్థమవుతోంది.

**ఇరు దేశాల సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం**

ఈ చర్యలు విజయవంతం అవుతాయా లేదా అన్నది పక్కన పెడితే ఇవి ఇరు దేశాల సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఈ బిల్లు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల పరిణామాలకు దారితీయొచ్చని భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఏడాది కాలంగా అమెరికా-భారత్ సంబంధాలకు తగులుతున్న ఎదురుదెబ్బల్లో ఈ ఆంక్షల బిల్లు అతిపెద్దది కావొచ్చని ప్రముఖ విదేశాంగ విధాన



నిపుణుడు మైఖేల్ కుగెల్‌మన్ ఎక్స్ లో పేర్కొన్నారు. 1998లో అణుశక్తిగా మారాలనే అత్యున్నత లక్ష్యం కోసం ఆంక్షలు ఎదుర్కొన్న భారత్ 2026లో మాత్రం కేవలం తన రోజువారీ ఇంధన అవసరాలు తీర్చుకుంటున్నందుకు టారిఫ్‌ల ముప్పు ఎదుర్కొంటోంది. ట్రంప్ ప్రభుత్వం భారత్‌ను ఎందుకు లక్ష్యంగా చేసుకుందనే విషయాన్ని పరిశీలిస్తే దీని వెనుక ఉన్న ప్రధాన కారణం భవిష్యత్తులో భారత్ మరో చైనాలా, అంటే అమెరికాకు సవాల్ విసిరే ఆసియా దిగ్గజంగా మారకూడదనే వ్యూహమేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

మార్చిలో భారత్‌లో పర్యటించిన అమెరికా విదేశాంగ శాఖ సహాయ మంత్రి క్రిస్టోఫర్ లాండౌ వ్యాఖ్యలు ఈ వాదనకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. 20 ఏళ్ల క్రితం చైనాతో చేసిన తప్పును భారత్‌తో చేయదల్చుకోలేదని ఆయన అప్పట్లో వ్యాఖ్యానించారు. తాము మార్కెట్లను అభివృద్ధి చేసుకునే అవకాశం ఇస్తే, ఆ తర్వాత మీరు వాణిజ్యపరంగా మమ్మల్నే దెబ్బకొడతారు అని ఆయన అన్నారు.

**భారత్ మరో చైనాలా అమెరికాకు సవాల్ విసరకూడదనే వ్యూహం**

అమెరికా చైనాతో చేసిన ఆ తప్పు ఏంటి అనే విషయాన్ని పరిశీలిస్తే 1970వ దశకం నుంచి అమెరికా, చైనాకు సాంకేతికత, పెట్టుబడులు, మార్కెట్ యాక్సెస్ ఇస్తూ ప్రోత్సహించింది. 1980లో అమెరికా ఆర్థిక వ్యవస్థలో కేవలం 7 శాతంగా ఉన్న చైనా జీడీపీ, 2025 నాటికి 19.5 ట్రిలియన్ డాలర్లకు చేరడం సహా అమెరికా ఆర్థిక వ్యవస్థలో 64 శాతానికి చేరింది. ప్రపంచ తయారీ రంగంలో చైనా వాటా 3 శాతం నుంచి 31.8 శాతానికి పెరిగింది. చైనా అభివృద్ధి చెందితే ప్రజాస్వామ్య దేశంగా మారుతుందని అమెరికా భావించగా అది రాజకీయంగా, ఆర్థికంగా అతిపెద్ద శత్రువుగా పరిణమించింది. అందుకే ఆ తప్పును రిపీట్ చేయకూడదని, భారత్‌ను తన ప్రయోజనాలకు అనుకూలమైన భాగస్వామిగా మాత్రమే ఉంచాలని అమెరికా భావిస్తోంది.

**ముడిచమురు అవసరాల్లో 88 శాతం దిగుమతులపైనే ఆధారపడిన భారత్**

అయితే నాటో కూటమి దేశాల మాదిరిగా అమెరికా ఆధిపత్యానికి భారత్ తలొగ్గే పరిస్థితి లేదు. భారత విదేశాంగ విధానం ఎప్పుడూ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి ఆధారంగానే సాగుతోంది. 140 కోట్ల మంది భారతీయుల ఇంధన భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యమని విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తరచూ స్పష్టంగా చెబుతూనే ఉన్నారు. ఇంధన లభ్యత, సరసమైన ధరలు, మార్కెట్ పరిస్థితుల ఆధారంగానే భారత్ నిర్ణయాలు ఉంటాయని అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ ఇటీవల తేల్చిచెప్పారు. 2024-25 నాటికి తమ ముడిచమురు అవసరాల్లో 88 శాతం దిగుమతులపైనే ఆధారపడిన భారత్‌కు రష్యా నుంచి వచ్చే చౌక చమురును వదులుకోవడం సాధ్యం కాదన్నారు.

మరి అమెరికా ఒత్తిడిని భారత్ తట్టుకోగలదా అంటే 1998లో ఆంక్షలు విధించినప్పుడు భారత్ కుంగిపోలేదు. స్వదేశీ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకుంటూనే అమెరికాతో సంబంధాలు కొనసాగించింది. చివరకు 2001లో అమెరికానే దిగివచ్చి ఆంక్షలు ఎత్తివేసింది. 2008 ఇండో- ఖా అణు ఒప్పందంతో భారత్‌ను అణుశక్తిగా గుర్తించింది. ఇప్పుడు కూడా భారత్ ఈ టారిఫ్ బెదిరింపులను అధిగమించాల్సి ఉంది. తన ఇంధన, సైనిక వనరులను వైవిధ్యపర్చుకుంటూ తయారీ రంగాన్ని బలోపేతం చేసుకోవాలి. అమెరికా సైతం ఒక విషయాన్ని గుర్తించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బంధం అనేది పరస్పర ప్రయోజనాలపై ఆధారపడి ఉండాలని, ఆధిపత్యం చలాయిస్తే కుదరదని స్పష్టం చేస్తున్నారు. భారత్‌ను భయపెట్టి రష్యా చమురును ఆపాలని చూస్తే, అది ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీయడమే తప్ప భారత్ ఎదుగుదలను ఆపలేదని పేర్కొంటున్నారు.

## యూపీఐ ఛార్జీలు వద్దు..

యూపీఐ లావాదేవీలపై ప్రతిపాదిత మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) లేదా ఇతర అదనపు ఛార్జీల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ (ఏఐఎంఆర్ఏ) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పటికే అత్యల్ప లాభాలతో వ్యాపారాలు నిర్వహిస్తున్నామని, ఈ అదనపు భారం తమ మనుగడను దెబ్బతీస్తుందని అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏఐఎంఆర్ఏ లేఖ రాసింది. దేశవ్యాప్తంగా 1.50 లక్షల మందికి పైగా చిన్న, మధ్య తరహా మొబైల్, ఎలక్ట్రానిక్స్ రిటైలర్లకు తాము ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు అసోసియేషన్ తెలిపింది. తాము కేవలం 0.75% నుంచి 1.5% నికర లాభాలతో వ్యాపారాలు సాగిస్తున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో యూపీఐ లావాదేవీలపై 0.4% ఎండీఆర్ విధిస్తే అది నేరుగా తమ లాభాలను హరిస్తుందని పేర్కొంది. ఉదాహరణకు, నెలకు రూ. 10 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు యూపీఐ లావాదేవీలు జరిపే రిటైలర్‌పై ప్రతి నెలా రూ.4,000 నుంచి రూ. 16,000 వరకు అదనపు ఆర్థిక భారం పడుతుందని వివరించింది. విక్రయాలు పడిపోవడం, నిర్వహణ ఖర్చులు పెరగడంతో మొబైల్ రిటైల్ రంగం ఇప్పటికే తీవ్ర ఒత్తిడిలో ఉందని అసోసియేషన్ తెలిపింది. దీనికి తోడు స్మార్ట్‌ఫోన్ల ధరలు కూడా విపరీతంగా పెరిగాయని, 2025లో రూ. 10,000కు లభించిన ఎంట్రీ-లెవల్ స్మార్ట్‌ఫోన్ ధర ప్రస్తుతం రూ. 17,000కు చేరిందని, 2026 డిసెంబర్ నాటికి ఇది రూ. 20,000కు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో చిన్న, మధ్య తరహా రిటైలర్లకు యూపీఐ ఎండీఆర్ నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వాలని, తక్కువ ఖర్చుతో కూడిన డిజిటల్ చెల్లింపుల ప్రక్రియను కొనసాగించాలని ఏఐఎంఆర్ఏ ప్రభుత్వాన్ని కోరింది. ఫీజుల నిర్మాణంపై నిర్ణయం తీసుకునే ముందు వాణిజ్య సంఘాలతో సంప్రదింపులు జరపాలని విజ్ఞప్తి చేసింది.

## డ్రోన్ల దాడికి రష్యా ప్రతీకారం..

## జపోరిఝియాపై భీకర దాడులు

రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధ ఉద్రిక్తతలు మరోసారి పరాకాష్ఠకు చేరాయి. ఆదివారం నాడు రష్యా భూభాగంపై ఉక్రెయిన్ వెయ్యికి పైగా డ్రోన్లతో భారీ దాడికి పాల్పడటంతో, మాస్కో ప్రతీకార చర్యలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఉక్రెయిన్‌లోని కీలక నగరమైన జపోరిఝియాను లక్ష్యంగా చేసుకుని రష్యా బలగాలు విరుచుకుపడుతున్నాయి. జపోరిఝియాలోని షాపింగ్ మాల్స్, నివాస సముదాయాలపై రష్యా దాడులు చేస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ దాడుల్లో పలువురు పౌరులు గాయపడినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, తాజా పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని, ఇది మాస్కో నియంత్రణ కోల్పోయేలా చేసిందని వ్యాఖ్యానించారు. ఇరు దేశాలు పరస్పర దాడులకు తెగబడుతుండటంతో ప్రస్తుతం కాల్పుల విరమణకు ఉన్న అవకాశాలు క్షీణించాయి. మరోవైపు, ఈ వారం న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ క్రమంలో రష్యాతో ఉద్రిక్తతలను తగ్గించే మార్గాలపై చర్చించేందుకు జెలెన్‌స్కీ, ట్రంప్‌తో భేటీ అయ్యే అవకాశం ఉందని సమాచారం

## రామ మందిరంలో భారీ కుంభకోణం

అయోధ్య రామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల చోరీకి సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆలయంలో ఏకంగా 105 సార్లు విరాళాల అపహరణ జరిగినట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ధారించింది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టుకు సిట్ తన నివేదికను సమర్పించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ కేసుకు సంబంధించిన సిట్ నివేదికలోని కీలక అంశాలను ధర్మాసనం ముందుంచారు. సీసీటీవీ ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. సాధారణంగా విరాళాలకు సాఫ్ట్‌వేర్ ద్వారా రశీదులు జారీ చేసి, ఆ నగదును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్‌లో భద్రపరుస్తారు. అయితే, ఈ ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగినట్లు దర్యాప్తులో తేలింది. ప్రస్తుతం దర్యాప్తు తుది దశకు చేరుకుందని, సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలు చేసే అవకాశం ఉందని మెహతా కోర్టుకు వివరించారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవకుశ్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామాశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామ్ శంకర్ యాదవ్ ఉన్నారు. నిందితులపై భారతీయ న్యాయ సంహితతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు వెలుగులోకి రావడంతో రామ్ మందిర్ ట్రస్టులో కీలక మార్పులు చేశారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలు తప్పుకున్న అనంతరం, ఆలయ పరిపాలన కోసం సీఈఓ నేతృత్వంలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రాను నూతన సీఈఓగా నియమించారు. కాగా, సిట్ నివేదిక ప్రతిని తమకు అందజేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

## రష్యా ఎన్నికల్లో పుతిన్ పార్టీ ఘనవిజయం

ఒకవైపు ఉక్రెయిన్‌తో ఐదేళ్లుగా సుదీర్ఘంగా యుద్ధం కొనసాగుతున్న వేళ రష్యాలో జరిగిన తొలి పార్లమెంట్ ఎన్నికల్లో అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మద్దతు ఉన్న యునైటెడ్ రష్యా పార్టీ భారీ ఆధిక్యం సాధించింది. దేశంలో ఉక్రెయిన్‌తో యుద్ధానికి ప్రజల మద్దతు ఉందో లేదో తెలుసుకోవడానికి ఈ ఎన్నికలను ఒక పరీక్షలా భావించగా, క్రెమ్లిన్ (రష్యా ప్రభుత్వం) ఊహించిన విధంగానే పుతిన్ వర్గానికి స్పష్టమైన మెజార్టీ లభించింది. రష్యా ఎన్నికల సంఘం (రష్యా సెంట్రల్ ఎలక్షన్ కమిషన్) వెల్లడించిన ప్రాథమిక ఫలితాల ప్రకారం అధికార యునైటెడ్ రష్యా పార్టీకి 57.83 శాతం ఓట్లు వచ్చాయి. మొత్తం 95 శాతానికిపైగా ఓట్లు లెక్కించగా కౌంటింగ్ ఇంకా సాగుతోంది. దీంతో అధికార పార్టీ విజయం ఖాయమైందనే చెబుతున్నారు. 2021లో చివరిసారిగా జరిగిన గత ఎన్నికల్లో ఈ పార్టీకి 49.8 శాతం ఓట్లు రాగా, ఈసారి ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్నప్పటికీ ఓటు బ్యాంకును గణనీయంగా పెంచుకుందని చెబుతున్నారు.

**స్టేట్ డ్యూమాలో 355 సీట్లు**

రష్యా పార్లమెంటులోని దిగువ సభను స్టేట్ డ్యూమా అంటారు. స్టేట్ డ్యూమాలో సగం సీట్లకే ఎన్నికలు నిర్వహిస్తారు. మిగతా సగం సింగిల్ మెంబర్ నియోజకవర్గాల ద్వారా భర్తీ చేస్తారు. ఇందులో మొత్తం 450 సీట్లు ఉండగా వీటిల్లో 225 స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల సంఘం లెక్కల ప్రకారం అధికార పార్టీ 225 సింగిల్ మెంబర్ నియోజకవర్గాల్లోనూ 208 చోట్ల ఆధిక్యంలో ఉంది. ఓవరాల్‌గా ప్రాథమిక ఫలితాల ప్రకారం యునైటెడ్ రష్యా పార్టీకి 450కు గానూ 355 సీట్లు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంటే దాదాపు మూడింట రెండొంతుల స్థానాల్ని ఈ పార్టీ గెలుచుకునే దిశగా సాగుతోంది. స్టేట్ డ్యూమాలో మెజార్టీ కోసం 301 సీట్లు గెలవాల్సి ఉంటుంది. యునైటెడ్ రష్యా 2003 నుంచి స్టేట్ డ్యూమాలో మెజార్టీ కొనసాగిస్తోంది. తాజా ఫలితాలు కూడా అదే ఆధిపత్యాన్ని సూచిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 57 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోటీలో ఉన్న ఇతర ప్రధాన ప్రతిపక్ష పార్టీల విషయానికి వస్తే కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ది రష్యన్ ఫెడరేషన్ (జ౧ాఖీ) 13.8 శాతం సీట్లతో రెండో స్థానంలో నిలిచింది. లిబరల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ రష్యా (ాణ్యూ=) 8.99 శాతం, న్యూ పీపుల్ పార్టీ 7.96 శాతం మేర ఓట్లను సాధించాయి. 'ఏ జస్ట్ రష్యా' పార్టీకి 4.96 శాతం ఓట్లు రాగా పార్లమెంటులోకి ప్రవేశం కూడా కోల్పోయింది. రష్యా పార్లమెంటులోకి ప్రవేశించాలంటే కనీసం 5 శాతం ఓట్లు పొందాల్సి ఉంటుంది. ఇక ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగలేదని పశ్చిమ దేశాలు విమర్శిస్తున్నాయి. ముఖ్యంగా విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఎన్నికల ప్రక్రియను పూర్తిగా నియంత్రించిందని, పుతిన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన ప్రతిపక్షాలు పోటీలో లేకుండా చేశారని ఆరోపిస్తున్నాయి. ముఖ్యంగా యుద్ధానికి వ్యతిరేకంగా 'శాంతి, స్వేచ్ఛ' అనే నినాదంతో పోటీలోకి దిగాలని భావించిన లిబరల్ పార్టీ 'యూబ్లోకో'ను కావాలనే పోటీ నుంచి తప్పించినట్లు మండిపడ్డాయి. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిందన్న సాకుతో రష్యా సుప్రీం కోర్టుతో ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆ పార్టీని నిషేధించేలా చేశాయని పేర్కొన్నాయి. ఇదే సమయంలో రష్యాలోని పలు ప్రాంతాల్లో గవర్నర్లు, ప్రాంతీయ శాసనసభలకు కూడా ఎన్నికలు నిర్వహించారు. ఇక్కడ కూడా ప్రాథమిక ఫలితాల్లో యునైటెడ్ రష్యా మద్దతున్న అభ్యర్థులే మెజార్టీ ప్రాంతాల్లో ఆధిక్యంలో ఉన్నారు. ఈ పార్టీకి చెందిన రమ్జాన్ కదిరోవ్ ఏకంగా 99.85 శాతం ఓట్లతో విజయం సాధించినట్లు సీఈసీ డేటాను ఉటంకిస్తూ రష్యా మీడియా తెలిపింది.

# సీఎస్‌కే కొత్త హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్

- ధోనీ సిఫారసుతో బాధ్యతలు
- స్టీఫెన్ ఫ్లెమింగ్ 18 ఏళ్ల శకానికి ముగింపు
- ఐపీఎల్ 2027 సీజన్ నుంచి కొత్త బాధ్యతలు చేపట్టనున్న భారత మాజీ పేసర్




ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీల్లోనైన చెన్నై సూపర్ కింగ్స్ (CSK) తమ కోచింగ్ విభాగంలో చారిత్రాత్మక మార్పుకు శ్రీకారం చుట్టింది. భారత మాజీ స్పీడ్ స్టార్ జహీర్ ఖాన్‌ను జట్టు నూతన హెడ్ కోచ్‌గా నియమిస్తున్నట్లు సీఎస్‌కే యాజమాన్యం సోమవారం అధికారికంగా ప్రకటించింది. 'Left Arm »»Takingμμ Over! Welcoming Zaheer Khan as the Head Coach of Chennai Super Kings!" అంటూ సోషల్ మీడియా వేదికగా ఆయనకు ఘనంగా స్వాగతం పలికింది. 2009 నుంచి సుదీర్ఘంగా 18 సంవత్సరాల పాటు సీఎస్‌కే ప్రధాన కోచ్‌గా వ్యవహరించి, జట్టుకు ఐదు ఐపీఎల్ టైటిళ్లు సాధించిపెట్టిన స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో జహీర్ ఖాన్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

### ధోనీ నేతృత్వంలోనే ముగిసిన అన్వేషణ

స్టీఫెన్ ఫ్లెమింగ్ తప్పుకున్న తర్వాత స్థానిక (భారత) కోచ్‌కే ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించిన యాజమాన్యం, కొత్త హెడ్ కోచ్‌ను ఎంపిక చేసే బాధ్యతను ఎంఎస్ ధోనీకే అప్పగించింది. అంతర్జాతీయ స్థాయిలో, ఐపీఎల్‌లో జహీర్ ఖాన్‌కున్న క్రికెటింగ్ మేధస్సుపై పూర్తి నమ్మకంతో ధోనీ ఆయన పేరును ప్రతిపాదించగా.. జట్టు ఓనర్ రూపా గురునాథ్, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, ఎండీ కాశీ విశ్వనాథన్‌లతో కూడిన కమిటీ దీనికి ఆమోదం తెలిపింది. గతంలో ముంబై ఇండియన్స్ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్‌గా, లక్నో సూపర్ జెయింట్స్ మెంటార్‌గా వ్యవహరించిన అనుభవం జహీర్‌కు ఉంది.

### సీఎస్‌కేలో నూతన అధ్యాయం

సీఎస్‌కే హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడంపై జహీర్ ఖాన్ ఆనందం వ్యక్తం చేశారు. "ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన జట్టులో భాగమవ్వడం గౌరవంగా భావిస్తున్నాను. ఆటగాడిగా చెపాక్‌లో సీఎస్‌కేను ఎదుర్కొన్న అనుభవాలు అద్భుతమైనవి. అక్కడి 'సూపర్‌ఫ్యాన్స్' సృష్టించే వాతావరణం ప్రత్యేకం" అని జహీర్ పేర్కొన్నారు. 2010, 2011, 2018, 2021, 2023లలో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన సీఎస్‌కే, గత మూడు సీజన్లలో అను అనుకున్న స్థాయిలో రాణించలేకపోయింది. ఈ నేపథ్యంలో 2027 ఐపీఎల్ సీజన్‌కు ముందే జట్టు నిర్మాణం, యువ బౌలర్లను తీర్చిదిద్దడం, వేలం వ్యూహాలు ఖరారు చేయడం జహీర్ ఖాన్ ముందున్న ప్రధాన లక్ష్యాలు.

# షూటింగ్‌లో మరో రజత పతకం

## టేబుల్ టెన్నిస్‌లో పాకిస్థాన్‌ను 3-0తో చిత్తు చేసిన భారత్

- ఏషియన్ గేమ్స్‌లో భారత్ జోరు
- షూటింగ్‌లో మరో సిల్వర్
- పాక్‌పై టేబుల్ టెన్నిస్‌లో ఘన విజయం



జపాన్‌లోని ఐచి-నాగోయాలో జరుగుతున్న ఏషియన్ గేమ్స్ 2026లో భారత్‌కు రెండో రోజు కూడా పతకాల పంట కొనసాగుతోంది. సెప్టెంబర్ 21న షూటింగ్‌లో పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత్ రజత పతకం సాధించింది. దీంతో భారత్ ఖాతాలో ఇప్పటివరకు మూడు రజత పతకాలు చేరాయి. షూటింగ్‌లో హిమాంశు ధిల్లాన్, పార్థ్ మానే, రుద్రాంశ్ పాటిల్తో కూడిన భారత జట్టు 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో రెండో స్థానంలో నిలిచింది. ఈ విజయంతో భారత్ మరో రజత పతకాన్ని ఖాతాలో వేసుకుంది. మహిళల టేబుల్ టెన్నిస్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన గ్రూప్ ఎఫ్ మ్యాచ్‌లో భారత జట్టు 3-0తో విజయం సాధించింది. ఈ విజయంతో భారత మహిళల జట్టు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. భారత్ తరఫున సుతీర్థా ముఖర్జీ, సిండ్రెలా దాస్, శ్రీజా అకులా తమ తమ మ్యాచ్‌ల్లో విజయాలు సాధించారు. శ్రీజా అకులా తన సింగిల్స్ మ్యాచ్‌లో ఫాతిమా ఖాన్‌ను 11-4, 11-4, 11-5 తేడాతో ఓడించి భారత్‌కు 3-0 విజయాన్ని ఖరారు చేశారు.

### భారత్‌కు పతకాలపై భారీ ఆశలు

ఏషియన్ గేమ్స్ రెండో రోజు భారత్ పలు క్రీడాంశాల్లో బరిలోకి దిగింది. షూటింగ్‌తో పాటు టేబుల్ టెన్నిస్, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (వీహీా), హాకీ, కబడ్డీ, బ్యాడ్మింటన్, బాక్సింగ్ తదితర ఈవెంట్లలో భారత క్రీడాకారులు పోటీ పడుతున్నారు. వీహీాలో సుచికా తారియాల్ సెమీఫైనల్‌లో సింగపూర్‌కు చెందిన టియో హుయ్ హాన్‌తో తలపడాల్సి ఉంది. సెమీఫైనల్‌కు చేరుకోవడంతో సుచికా ఇప్పటికే కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకున్నారు. ఫైనల్‌కు చేరితే స్వర్ణ పతకం కోసం పోటీపడే అవకాశం ఉంటుంది. మహిళల హాకీలో భారత్ ఇండోనేషియాతో, పురుషుల కబడ్డీలో జపాన్‌తో, మహిళల కబడ్డీలో బంగ్లాదేశ్‌తో తలపడుతోంది. బ్యాడ్మింటన్‌లో భారత పురుషుల జట్టు బంగ్లాదేశ్‌తో పోటీ పడుతోంది. బాక్సింగ్‌లో సుమిత్ 70 కేజీ విభాగంలో బుంజోంగ్ సింసిరితో పోటీపడుతున్నారు. ఏషియన్ గేమ్స్ 2026 తొలి రోజు భారత్‌కు షూటింగ్‌లో రెండు రజత పతకాలు లభించాయి. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో ఎలావెనిల్ వలరివన్ రజతం సాధించగా, టీమ్ ఈవెంట్‌లో ఎలావెనిల్ వలరివన్, సోనమ్ మాస్కర్, విదర్సా వినోద్‌లతో కూడిన భారత జట్టు మరో రజత పతకం సాధించింది. ఇప్పుడు పురుషుల షూటింగ్ టీమ్ సాధించిన మరో రజతంతో భారత్ పతకాల సంఖ్య మూడు రజతాలకు చేరింది. ఏషియన్ గేమ్స్‌లో భారత్ మరిన్ని పతకాలు సాధించేందుకు రెండో రోజు పోటీలు కొనసాగుతున్నాయి.

# ఫాల్కన్స్ 'ఫస్ట్' ఫైట్.. సీపీఎల్ కిరీటం సొంతం!



- జమైకా కింగ్స్‌మెన్‌కు ఫైనల్లో షాక్
- 8 వికెట్ల తేడాతో ఫాల్కన్స్ ఘన విజయం
- సదాఖత్ 114 పరుగుల విధ్వంసం వృథా
- 4 వికెట్లతో మ్యాచ్‌ను తిప్పిన మెకీమ్
- మూడో సీజన్‌లోనే తొలి టైటిల్ ముద్దాడిన ఆంటిగ్వా

కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆంటిగ్వా అండ్ బార్బుడా ఫాల్కన్స్ కొత్త చరిత్ర సృష్టించింది. కెన్సింగ్టన్ ఓవల్‌లో ఆదివారం రాత్రి జరిగిన 2026 ఫైనల్లో జమైకా కింగ్స్‌మెన్‌ను ఎనిమిది వికెట్ల తేడాతో చిత్తుచేసి తొలిసారి సీపీఎల్ కిరీటాన్ని ముద్దాడింది. 171 పరుగుల లక్ష్యాన్ని ఫాల్కన్స్ 16.4 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఫ్రాంచైజీగా మూడో సీజన్‌లోనే ఛాంపియన్‌గా నిలిచి సత్తా చాటింది.

### సదాఖత్ ఒంటరి పోరాటం

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన జమైకా కింగ్స్‌మెన్ నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 170 పరుగులు చేసింది. మాజ్ సదాఖత్ 58 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, తొమ్మిది సిక్సర్లతో ఏకంగా 114 పరుగులు బాదాడు. సైమ్ అయూబ్ 29 పరుగులు చేయగా మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. కిర్క్ మెకెంజీ, రోవ్‌మన్ పావెల్ సహా పలువురు ఖాతా తెరవకుండానే వెనుదిరిగారు. 30 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన కింగ్స్‌మెన్‌ను సదాఖత్, అయూబ్ ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి స్కోరును 110 పరుగులకు చేర్చారు. ఈ దశలో ఫాల్కన్స్ స్పిన్నర్ సుఫ్యాన్ మెకీమ్ మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. అయూబ్, పావెల్‌ను ఒకే ఓవర్‌లో పెవిలియన్‌కు పంపడంతో కింగ్స్‌మెన్ ఒక్కసారిగా కుప్పకూలింది. మెకీమ్ నాలుగు వికెట్లకు కేవలం 14 పరుగులిచ్చి ఫాల్కన్స్‌కు భారీ ఆధిక్యం అందించాడు.

### 171 లక్ష్యం.. 100 బంతుల్లోనే ఫినిష్

లక్ష్య ఛేదనలో రహ్కీమ్ కార్న్‌వాల్ తొలి ఓవర్‌లోనే రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 20 పరుగులు రాబట్టి మెరుపు ఆరంభం ఇచ్చాడు. అయితే అదే ఓవర్ చివరి బంతికి ఔటయ్యాడు. అనంతరం ఎవిన్ లూయిస్, అమీర్ జంగూ రెండో వికెట్‌కు 64 పరుగులు జోడించారు. లూయిస్ 38 పరుగుల వద్ద వెనుదిరిగినా ఫాల్కన్స్ జోరుకు అడ్డుకట్ట పడలేదు. అమీర్ జంగూ, హసన్ నవాజ్ ఆ తర్వాత కింగ్స్‌మెన్ బౌలర్లకు మరో అవకాశం ఇవ్వలేదు. ఇద్దరూ మూడో వికెట్‌కు అజేయంగా 89 పరుగులు జోడించారు. జంగూ 57, హసన్ నవాజ్ 47 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. 16.4 ఓవర్లలో 173/2తో ఫాల్కన్స్ లక్ష్యాన్ని చేరుకుని మరో 20 బంతులు మిగిలుండగానే చారిత్రక విజయాన్ని అందుకుంది. నాలుగు వికెట్లతో ఫైనల్‌ను మలుపుతిప్పిన సుఫ్యాన్ మెకీమ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా, టోర్నీ మొత్తంలో రాణించిన షాదాబ్ ఖాన్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచారు. సదాఖత్ శతకం.. కింగ్స్‌మెన్ పోరాటం.. అన్నింటినీ అధిగమించిన ఫాల్కన్స్ చివరకు సీపీఎల్‌లో తమ తొలి కిరీటాన్ని ఎగరేసుకుపోయింది.



# విదేశాల్లో ఆ ఇద్దరూ మెరుగుపడాలి

## సందీప్ పాటిల్

భారత క్రికెట్‌లో దూకుడైన బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటున్న యువ ఆటగాళ్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీలపై మాజీ భారత ఆల్‌రౌండర్ సందీప్ పాటిల్ ప్రశంసలు కురిపించారు. ఇద్దరిలోనూ అద్భుతమైన ప్రతిభ, భారీ షాట్లు ఆడే సామర్థ్యం ఉందని పేర్కొన్నారు. అయితే విదేశీ పరిస్థితుల్లో తమ ఆటను మరింత మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. స్వదేశంలో బంతిని ఎదుర్కొనే సమయంలో అభిషేక్, వైభవ్ ఎంతో దూకుడుగా కనిపిస్తున్నారని పాటిల్ అన్నారు. అయితే బంతి స్వింగ్ అవుతున్న పరిస్థితుల్లో ఇద్దరూ కొంత ఇబ్బంది పడుతున్నట్లు కనిపించిందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంగ్లాండ్ పర్యటనలో ఈ విషయం స్పష్టమైందని చెప్పారు. విదేశీ పిచ్‌లపై పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ శైలిని మార్చుకోవడం యువ ఆటగాళ్లకు ఎంతో ముఖ్యమని సూచించారు. జులైలో జరిగిన ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌లో అభిషేక్ శర్మ ఐదు మ్యాచ్‌ల్లో 131 పరుగులు చేశాడు. అదే సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేసి మూడు మ్యాచ్‌ల్లో 42 పరుగులు సాధించాడు. స్వింగ్‌కు అనుకూలమైన పరిస్థితుల్లో వారి బ్యాటింగ్‌పై సందేహాలు వ్యక్తమైనప్పటికీ, ఆ తర్వాతి మ్యాచ్‌ల్లో ఇద్దరూ తమ సత్తాను చాటుకున్నారు. జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ ఆకట్టుకోగా, భారత్ సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకున్న సమయంలో అతడు అత్యుత్తమ ఆటగాడిగా నిలిచాడు. మరోవైపు అఫ్గానిస్థాన్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అభిషేక్ శర్మ తన బ్యాటింగ్ సత్తాను మరోసారి చాటాడు. చివరి మ్యాచ్‌లో కేవలం 30 బంతుల్లోనే శతకం సాధించి సంచలనం సృష్టించాడు. అభిషేక్ నుంచి ఇలాంటి ఇన్నింగ్స్ రావడం తనకు ఆశ్చర్యం కలిగించలేదని పాటిల్ అన్నారు. ఆధునిక క్రికెట్‌లో యువ బ్యాటర్లకు తొలి బంతి నుంచే సహజమైన దూకుడుతో ఆడే స్వేచ్ఛ లభిస్తోందని, అభిషేక్, వైభవ్ ఆ అవకాశాన్ని సమర్థంగా ఉపయోగించుకుంటున్నారని ప్రశంసించారు. అయితే విదేశీ పర్యటనల్లోనూ అదే స్థాయిలో రాణించాలంటే స్వింగ్ అవుతున్న బంతులను ఎదుర్కొనే విషయంలో మరింత పట్టు సాధించాల్సిన అవసరం ఉందని సూచించారు.

# ఏషియన్ గేమ్స్‌లో సుచికా చరిత్ర

ఏషియన్ గేమ్స్‌లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ విభాగంలో భారత క్రీడాకారిణి సుచికా తారియాల్ చరిత్ర సృష్టించింది. మహిళల ట్రెడిషనల్ 60 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఏషియన్ గేమ్స్‌లో ఎంఎంఏకు తొలిసారి చోటు దక్కగా.. ఈ విభాగంలో భారత్‌కు తొలి పతకాన్ని అందించిన క్రీడాకారిణిగా సుచికా రికార్డు నెలకొల్పింది. సెమీఫైనల్లో సింగపూర్‌కు చెందిన హుయ్ హాన్ టియోతో సుచికా తలపడింది. హోరాహోరీగా సాగిన ఈ పోరు అదనపు సమయానికి వెళ్లింది. చివరికి స్వల్ప తేడాతో సుచికా ఓటమి పాలై ఫైనల్ అవకాశాన్ని కోల్పోయింది. అయితే అప్పటికే కాంస్య పతకం ఖరారైంది. అంతకుముందు క్వార్టర్‌ఫైనల్లో మంగోలియాకు చెందిన అల్టాన్‌చిమెగ్ బైగల్మాను 2-0తో ఓడించి భారత్‌కు ఎంఎంఏలో తొలి పతకాన్ని ఖాయం చేసింది. 36 ఏళ్ల సుచికా క్రీడా ప్రయాణం ఎంఎంఏకే పరిమితం కాలేదు. జాతీయస్థాయిలో జూడో క్రీడాకారిణిగా ఎదిగిన ఆమె 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొంది. 2023 ఏషియన్ గేమ్స్‌లో కురాష్‌లోనూ పోటీపడింది. అనంతరం జియూ-జిట్సులో రాణించి 2024లో ఫైటింగ్ జియూ-జిట్సు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. 2017లో ఎంఎంఏలో ప్రొఫెషనల్‌గా అరంగేట్రం చేసిన ఆమె.. ఇతర క్రీడలపై దృష్టి పెట్టడంతో కొంతకాలం ఎంఎంఏకు దూరంగా ఉంది. 2024లో మళ్లీ ఎంఎంఏలోకి అడుగుపెట్టి 'బ్రేవ్ కంబాట్ ఫెడరేషన్'తో ఒప్పందం చేసుకుంది. గాయాలు సహా పలు సవాళ్లను అధిగమించి తిరిగి పోటీల్లోకి వచ్చిన సుచికా.. ఇప్పుడు ఏషియన్ గేమ్స్‌లో భారత్‌కు చారిత్రక పతకాన్ని అందించింది. ఏషియన్ గేమ్స్‌లో ఎంఎంఏ తొలిసారి ప్రవేశించగానే భారత్‌కు పతకం రావడం విశేషంగా నిలిచింది.



RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు..
PEN SATTA Telugu Daily
మంగళవారం 22 సెప్టెంబర్ 2026

## సంపాదకీయం

### వారసత్వ మలుపు

చరిత్ర కొన్నిసార్లు యథాతథంగా కాదు, విచిత్రమైన మలుపుతో తిరిగొస్తుంది. బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహమాన్ భారత్‌తో వ్యూహాత్మక బంధాన్ని తగ్గించుకుంటూ.. పాకిస్తాన్‌తో సంబంధాలను మెరుగుపర్చుకోవాలని ప్రయత్నించి దాదాపు యాభై ఏళ్లు కావస్తోంది. ఇప్పుడు ఆయన కుమారుడు, ప్రధాన మంత్రి తారిక్ రెహమాన్, 'మక్కా ఒప్పందం' ద్వారా పాకిస్తాన్‌తో బంగ్లాదేశ్‌ను మరింత దగ్గర చేసే అసాధారణ మలుపువద్ద నిలబడ్డారు. ఈ ఏడాది ఆగస్టు 7న సౌదీ అరేబియా, టర్కీ, పాకిస్తాన్ దేశాలు మక్కాలో సంతకం చేసిన ఈ త్రైపాక్షిక రక్షణ ఒప్పంద (ఏదైనా ఒక సభ్యదేశంపై సాయుధ దాడి జరిగితే.. దాన్ని మూడు దేశాలపైనా దాడిగా పరిగణించే నాటో తరహా సూత్రం) కూటమిలో చేరాలన్న ఆసక్తిని బంగ్లాదేశ్ విదేశాంగ సలహాదారు హుమాయూన్ కబీర్ ఇప్పటికే బహిరంగంగా వ్యక్తం చేశారు, "పశ్చిమాసియాలో ఇస్లామిక్ దేశాల మధ్య భద్రతా ఏర్పాటుంటే, అందులో మేము పాల్గొనడం అసాధారణం కాదు" అంటూ. సౌదీ యువరాజు ఆహ్వానం మేరకు తారిక్ రెహమాన్ రియాద్ పర్యటన త్వరలో ఖరారు కానుంది. ఈ పరిణామంపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ, "పశ్చిమాసియాలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాం" అని వ్యాఖ్యానించారు. తరాలమధ్య ఈ పోలిక నిజంగా ఆసక్తికరమైనది. 1971 తర్వాత బంగ్లాదేశ్ సార్వభౌమత్వాన్ని సుస్థిరం చేయడంలో సహకరించిన జియావుర్ రెహమాన్, వ్యూహాత్మక స్థలం కోసం పాకిస్తాన్ వైపు తిరిగారు. మారిన దక్షిణాసియా పరిస్థితుల్లో, ఆయన కుమారుడు ఆ వైవిధ్యీకరణ స్వభావానికి అధికారిక భద్రతా కోణాన్ని జోడించే దిశగా అడుగులేస్తున్నారు!

అయితే బంగ్లాదేశ్ పాకిస్తాన్ వైపు మొగ్గు చూపడంలో విచిత్రమైన మలుపు, ఉద్దేశపూర్వక సవాలూ లేకపోలేదు. పాకిస్తాన్ సైనిక అతిరేకాలు బంగ్లాదేశ్ చరిత్రలో చెరగని అధ్యాయంగా మిగిలిపోయాయి. బంగ్లాదేశ్‌ను ఇప్పుడు నడిపిస్తున్న తారిక్ తండ్రి జియావుర్ రెహమాన్ స్వయంగా ఆ విముక్తి పోరాటంలో బంగ్లాదేశ్ పక్షాన పోరాడిన వ్యక్తి. అయినప్పటికీ, అధ్యక్షుడిగా ఆయన తర్వాత భారత్‌నుంచి వ్యూహాత్మక దూరం కోసం పాకిస్తాన్ వైపు మళ్లారు. ఇప్పుడు తారిక్ ఆ వారసత్వాన్ని పాకిస్తాన్-సంబంధిత భద్రతా ఏర్పాటు ద్వారా మరింత ముందుకు తీసుకెళితే, ఆ సంజ్ఞను కేవలం దౌత్యపరమైన సర్దుబాటుగా కొట్టిపారేయలేం. బంగ్లాదేశ్ విముక్తి కోసం పోరాడిన వ్యక్తి కుమారుడు, బంగ్లాదేశ్ స్వాతంత్ర్యాన్ని అణచివేసిన దేశంవైపు మొగ్గుతూ, ఆ స్వాతంత్ర్యాన్ని సాధ్యం చేసిన పొరుగుదేశానికి ఒక పరోక్ష సందేశాన్ని పంపడం రాజకీయ ప్రతీకాత్మకతను సంతరించుకుంటుంది. తారిక్ ఈ వ్యూహాత్మక మార్గదర్శకాన్ని తన తల్లి ఖలీదా జియా నుంచి కూడా వారసత్వంగా పొందారు. పాకిస్తాన్‌తో వెచ్చని సంబంధాలు, బలమైన ఇస్లామిక్ గుర్తింపును కలిపి, అవామీ లీగ్ యొక్క భారత్ కేంద్రిత దృక్పథం నుంచి బంగ్లాదేశ్‌ను వేరుపరచాలన్న ఆమె రాజకీయ సంప్రదాయం ఇప్పటికీ ప్రభావం చూపుతోంది. ఈ వారసత్వ కోణం నుంచి చూస్తే, మక్కా ఒప్పందం అదనపు ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. అయితే, దీని తక్షణ విలువ ప్రధానంగా సైనిక జోక్యంలో ఉండదు. బంగ్లాదేశ్‌కు టర్కీ, సౌదీ అరేబియా, పాకిస్తాన్‌ల నుంచి భౌగోళిక దూరం, సంప్రదాయ సైనిక జోక్యానికి ఉండే లాజిస్టిక్ కష్టాలు, అలాంటి పరిస్థితిని ఊహించడం కష్టతరం చేస్తాయి. కాబట్టి ఈ ఒప్పందం విలువ, అది సైనికంగా ఏం సాధించగలదు అన్నదానికంటే, ఏం సందేశాన్ని ఇస్తుందన్న దానిలోనే ఎక్కువగా ఉండవచ్చు. అంతర్జాతీయంగా, న్యూఢిల్లీకి మించి ఢాకాకు వ్యూహాత్మక ఎంపికలున్నాయని ఇది సూచిస్తుంది. ప్రాంతీయంగా, వ్యూహాత్మక సమతుల్యతను మార్చగల సంబంధాలకు బంగ్లాదేశ్ సిద్ధంగా ఉందనీ తెలియజేస్తుంది. దేశీయంగా, తల్లిదండ్రుల రాజకీయ వారసత్వానికి వారసుడిగా తారిక్ తనను తాను ప్రదర్శించుకోగలుగుతారు. భారత అతిక్రమణగా భావించే దాన్ని ప్రతిఘటించే జాతీయవాదిగా, అదే సమయంలో విస్తృత ముస్లిం ప్రపంచంలో బంగ్లాదేశ్ స్థానాన్ని పునరుద్ఘాటించే నేతగా.

బంగ్లాదేశ్‌కు ఈ ఒప్పందంలో చేరడం వల్ల భారత్‌తో బేరసారాల్లో మరింత పైచేయి లభించవచ్చు. పాకిస్తాన్, సౌదీ అరేబియా, టర్కీలను తన దౌత్య, భద్రతా లెక్కల్లోకి తీసుకురావడం ద్వారా, తారిక్ బంగ్లాదేశ్ వ్యూహాత్మక ఎంపికలను వైవిధ్యపరచుకుని, తన భౌగోళిక పరిస్థితి, ఆర్థిక ఆధారపడటంలో ఉన్న అసమతుల్యతను తగ్గించుకోగలరు. దీని లక్ష్యం భారత్‌కు వ్యతిరేకంగా ఏర్పడటం కానవసరం లేదు. నీరు, సరిహద్దులు, వాణిజ్యం, రవాణా, ఇంధన సహకారంలో తమ సహకారాన్ని తేలికగా తీసుకోలేమని చాటిచెప్పడమే ఉద్దేశం కావచ్చు. మరో లెక్క కూడా దాగి ఉండొచ్చు. భారత్‌పై ఎక్కువ పైచేయి సాధిస్తే, చైనానుంచి మరింత ఉదారత లభించవచ్చు. ఈ తర్కం త్రిభుజాకారంలో పనిచేస్తుంది. ఢాకాకు ప్రత్యామ్నాయాలున్నాయని న్యూఢిల్లీకి చూపిస్తే, ఆర్థిక సహాయం, మౌలిక వసతులు, రక్షణ సహకారం, సాంకేతికత, రాజకీయ మద్దతు ద్వారా బంగ్లాను మరింత దగ్గరకు తీసుకునే అవకాశాన్ని బీజింగ్ చూడవచ్చు. పోటీ ప్రపంచ ప్రాధాన్యతలతో అమెరికా తీరిక లేకుండా ఉన్న ఈ తరుణంలో, గతంలో అది అందించిన వ్యూహాత్మక, ఆర్థిక ప్రతిసమతూకాన్ని అందించే స్థితిలో లేకపోవడం ఈ లెక్కను మరింత సంబంధితం చేస్తుంది. భారత్, చైనా, ఇతర భాగస్వాముల మధ్య పోటీయే తనకు ఒక ఆస్తిగా బంగ్లాదేశ్ భావిస్తుండవచ్చు. ఢాకా ఎంత అనివార్యంగా మారితే, అంత ఎక్కువ రాయితీలు రాబట్టుకోగలదు. కాబట్టి, తారిక్ లెక్క భారత్‌కు బదులు పాకిస్తాన్‌ను, అమెరికాకు బదులు చైనాను ఎంచుకోవడం గురించి కాదు, ప్రతి పెద్ద శక్తీ బంగ్లాదేశ్ అనుకూలతకు మరింత పోటీపడేలా తగినంత భౌగోళిక రాజకీయ పోటీని సృష్టించడం గురించి కావచ్చు. చివరిగా, ఈ కథలో అత్యంత ముఖ్యమైన కోణమిదే కావచ్చు, బంగ్లాదేశ్‌కు అత్యంత తీవ్రమైన జాతీయ గాయానికి కారణమైన పాకిస్తాన్, ఇప్పుడు 1971లో బంగ్లాదేశ్ ఎందుకోసం పోరాడిందో అదే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని నొక్కిచెప్పే సాధనంగా మారవచ్చు. సామూహిక రక్షణ గురించినదిగా కనిపించే ఈ ఒప్పందం, బంగ్లాదేశ్‌కు మాత్రం భౌగోళిక పరిస్థితినే రాజకీయంగా తక్కువ నిర్ణాయకంగా మార్చే దౌత్యపరమైన సాధనంగా మారడమే విచిత్రమైన మలుపు కావచ్చు. దీన్ని తారిక్ చివరకు విధానంగా మార్చినా మార్చకపోయినా, న్యూఢిల్లీ మాత్రం బంగ్లాదేశ్‌ను తన వ్యూహాత్మక కక్ష్యలోనే ఉంటుందని ఇకపై భావించలేదన్న సందేశాన్ని ఇప్పటికే అందుకుంది!

## పనికొచ్చే పలుకు




### గృహిణి నుంచి 'గ్రీన్ ఆరా' వరకూ..

కొబ్బరి చెట్టు అనగానే గుర్తొచ్చేది చల్లటి కొబ్బరినీళ్లు, వంటల్లో వాడే తురుము, చట్నీలు మాత్రమే. దక్షిణాది వంటిల్లుకు ఇది నిత్యావసరమే తప్ప, చాలామందికి ఇదొక వ్యాపార అవకాశంగా కనిపించదు. కానీ కేరళకు చెందిన సుమిల జయరాజ్‌కు మాత్రం, ఖాళీ ఇంట్లో మిగిలిన ఒంటరితనమే ఒక కోటి రూపాయల వ్యాపారానికి బీజం వేసింది.

జువాలజీ, ఇంగ్లీష్ లిటరేచర్‌లో పట్టా పుచ్చుకున్న సుమిల, పెళ్లయ్యాక భర్తతో కలిసి ముంబైకి మారారు. కవల పిల్లలు పుట్టడంతో కొన్నేళ్లు పూర్తిగా కుటుంబ బాధ్యతలకే అంకితమయ్యారు. కానీ కాలం అందరినీ ఒకేలా వదిలిపెట్టదు – పిల్లలు ఉన్నత చదువుల కోసం దూరమయ్యారు, భర్త ఉద్యోగం కోసం దుబాయ్ వెళ్లారు. ఇంటి నిండా నిశ్శబ్దమే మిగిలింది. చాలామంది ఈ దశలో బాధపడి ఆగిపోతారు. సుమిల మాత్రం దీన్నొక కొత్త ప్రారంభానికి అవకాశంగా మలుచుకున్నారు.

తనకంటూ ఒక గుర్తింపు కావాలన్న తపనతో, స్థానికంగా వర్జిన్ కోకోనట్ ఆయిల్ తయారుచేసే ఒక చిన్న కంపెనీలో ఉద్యోగంలో చేరారు. అక్కడ కస్టమర్ల సందేహాలు తీర్చడం, విదేశీ క్లయింట్లతో మాట్లాడటం ఆమె పనిలో భాగం. ఈ క్రమంలోనే లండన్ నుంచి కంపెనీకి తొలి ఎగుమతి ఆర్డర్‌ను సాధించి పెట్టారు. అదే ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది – "ఇతరుల కోసం చేయగలిగినది, నా కోసం ఎందుకు చేయలేను?" అన్న ప్రశ్న మనసులో మెదిలింది.

ఆలస్యం చేయకుండా ఉద్యోగానికి రాజీనామా చేసిన సుమిల, ఇంటి పక్కనే ఉన్న ఒక చిన్న షెడ్‌లో సొంత తయారీ యూనిట్‌ను ప్రారంభించారు. కొబ్బరిలోని పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు దెబ్బతినకుండా ఉండేందుకు 'సెంట్రిఫ్యూగల్ టెక్నాలజీ' వినియోగించి కోల్డ్ ప్రెస్డ్ వర్జిన్ కోకోనట్ ఆయిల్‌ను తయారుచేయడం మొదలుపెట్టారు. బ్యాంకు రుణాలు తిరస్కరించడం, కొత్త ఉత్పత్తికి మార్కెట్ సృష్టించడం – ఈ సవాళ్లేవీ ఆమెను ఆపలేకపోయాయి. చివరికి 2021లో 'గ్రీన్ ఆరా' పేరుతో తన సొంత బ్రాండ్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చారు.

కేవలం కొబ్బరి నూనెకే పరిమితం కాకుండా, చట్నీ పొడులు, పచ్చళ్లు, కొబ్బరి పాల పొడి, సాంబార్ పొడి వంటి విభిన్న ఉత్పత్తులతో తన బ్రాండ్‌ను విస్తరించారు. నేడు 'గ్రీన్ ఆరా' ఉత్పత్తులు భారత్‌లోనే కాకుండా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, మలేషియా వంటి దేశాలకూ ఎగుమతి అవుతున్నాయి. ఖాళీ ఇంట్లో మిగిలిన ఒంటరితనంతో మొదలైన ఈ ప్రయాణం, ఇవాళ నెలకు సగటున రూ. 20 లక్షల వ్యాపారంగా ఎదిగింది.

గృహిణిగా జీవితం ముగిసిపోయిందని అనుకున్న క్షణంలోనే, సుమిల దాన్ని ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికే మలుపుగా మార్చుకున్నారు. వయసు, కుటుంబ బాధ్యతలు అడ్డంకులుగా అనిపించే ప్రతి ఆమెకూ, ఆలస్యంగా మొదలుపెట్టినా, గమ్యం చేరుకోవచ్చని ఈ కథ నిరూపిస్తోంది.


# చమురుపై చట్టం కొరడా!?




రష్యా చమురు దిగుమతులపై అమెరికా రూపొందించిన కొత్త చట్టం, భారత్-అమెరికా సంబంధాల్లో ఇప్పటివరకూ చూడని కొత్త, తీవ్రస్థాయి ఉద్రిక్తతను తీసుకువచ్చింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సెప్టెంబర్ 18న సంతకం చేసి చట్టంగా మార్చిన 'లిండ్సే ఓ గ్రాహం రష్యా, ఇరాన్‌లపై ఆంక్షల చట్టం -2026', రష్యానుంచి భారీ మొత్తంలో చమురు, గ్యాస్ దిగుమతి చేసుకునే భారత్‌వంటి దేశాలపై వంద శాతం వరకూ సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కట్టబెడుతుంది. ఈ చట్టానికి సెనేట్‌లో 86-11 ఓట్లతో, ప్రతినిధుల సభలో 262-159 ఓట్లతో భారీ మెజారిటీ లభించింది. ఇంతటి ద్విపక్ష మద్దతు అమెరికా రాజకీయాల్లో అరుదైన విషయం, ముఖ్యంగా ట్రంప్ హయాంలో ఇది మరింత విశేషమైనది. ఈ బిల్లును ముందుండి నడిపించిన సెనేటర్ లిండ్సే గ్రాహం, ఈ ఏడాది జులైలో మరణించగా, ఆయన పేరుమీదే చట్టాన్ని రూపొందించారు. ఇది ఉక్రెయిన్ యుద్ధాన్ని పోషిస్తున్న రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలన్న అమెరికా చట్టసభల దీర్ఘకాలిక ప్రయత్నానికి ఇప్పటివరకూ అత్యంత బలమైన అడుగుగా చెప్పుకోవచ్చు. గతంలో ట్రంప్ విధించిన ప్రతీకాత్మక సుంకాల కంటే ఇది మరింత తీవ్రమైనది, శాశ్వతమైనది కూడా. గత ఏడాది రష్యా చమురు దిగుమతులపై భారత్‌కు విధించిన 50 శాతం ప్రతీకార సుంకాలు కేవలం ఒక కార్యనిర్వాహక ఉత్తర్వు (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్) ద్వారా అమల్లోకి వచ్చాయి కాబట్టి, అదే పద్ధతిలో వాటిని ఉపసంహరించుకోవడం సాధ్యమైంది. వాస్తవానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆ 25 శాతం అదనపు సుంకాన్ని అమెరికాయే ఉపసంహరించుకుంది కూడా. కానీ ఈ కొత్త చట్టం అమెరికా కాంగ్రెస్ ఆమోదంతో వచ్చినది కాబట్టి, దీనికి చట్టబద్ధమైన, శాశ్వతమైన బలం ఎక్కువ. ఈ చట్టం నుంచి ఏదైనా మినహాయింపు ఇవ్వాలంటే, దానికి తగిన కారణాలను వివరిస్తూ ట్రంప్ కాంగ్రెస్‌కు లిఖితపూర్వకంగా సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఇది ఆయన నిర్ణయాధికారంపై ఒక నిర్దుష్ట పరిమితిని విధిస్తుంది, గతంలో మాదిరిగా ఒక్క సంతకంతో అన్నీ మార్చేసే వెసులుబాటు ఇకపై ఉండదు.

గత ఏడాది విధించిన 50 శాతం సుంకాలు భారత ఎగుమతులను తీవ్రంగా దెబ్బతీసినప్పటికీ, ఆ భారాన్ని ఎగుమతిదారులు తమ అమెరికన్ కస్టమర్లతో పంచుకోవడం ద్వారా కొంతమేర ప్రభావాన్ని తగ్గించుకోగలిగారు. అయితే ఇది ఆర్థికంగా చాలా ఇబ్బందికరమైన, ఎక్కువకాలం కొనసాగించలేని ఏర్పాటు, లాభాల మార్జిన్‌ను తగ్గించుకుని కస్టమర్లను నిలుపుకోవడం అనేది శాశ్వత పరిష్కారం కాదు. ఇప్పుడు వందశాతం సుంకాన్ని ఇదేవిధంగా పంచుకోవడం, ప్రధానంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ఎగుమతిదారులకు పూర్తిగా అసాధ్యమైన విషయం. వీరికి పెద్ద కంపెనీల మాదిరిగా నష్టాలను భరించే ఆర్థిక సామర్థ్యంగానీ, ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కునే వనరులుగానీ ఉండవు. ఇప్పటికే అమల్లో ఉన్న 10 శాతం 'బలవంతపు కార్మిక' సుంకం, ఉక్కు-అల్యూమినియంపై 50 శాతం సెక్షన్ 232 సుంకాలకు అదనంగా ఈ వంద శాతం సుంకం వస్తే, భారత ఎగుమతులు అమెరికా మార్కెట్లో పోటీపడలేని స్థితికి చేరుకుంటాయి. వాస్తవానికి కొన్ని ఉత్పత్తుల విషయంలో సుంకాల మొత్తం, ఉత్పత్తి విలువను మించిపోయే ప్రమాదం కూడా ఉంది. ఈ నేపథ్యంలో భారత్ ముందు మూడు మార్గాలు ఉన్నాయి. రష్యా చమురు దిగుమతులను తగ్గించుకోవడం, ఆ దిగుమతులను కొనసాగిస్తూనే సుంకాలను భరించడం, లేదా చట్టంలోని "వంద శాతం వరకూ" అనే పదజాలాన్ని ఉపయోగించి తక్కువ సుంకం విధించేలా అమెరికాను ఒప్పించడం. మూడు మార్గాలూ తమదైన సవాళ్లతో కూడుకున్నవే. రష్యా చమురు దిగుమతులను కొనసాగిస్తూ సుంకాలను భరించే మార్గం, భారత ఎగుమతి లక్ష్యాలకు, ఎంఎస్ఎంఈ రంగానికి పెద్ద దెబ్బగా మారుతుంది. మొత్తం భారత వస్తు ఎగుమతుల్లో దాదాపు 20 శాతం వాటా అమెరికాదే కావడంతో, ఆ మార్కెట్‌ను నిర్లక్ష్యం చేయడం సాధ్యం కాదు. అంతేకాక, గతంలో అనేకసార్లు రుజువైనట్టు, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి గురించి గట్టిగా మాట్లాడినప్పటికీ, నిర్దిష్ట దేశాల నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించుకోవాలన్న అమెరికా ఒత్తిడికి భారత్ సాధారణంగా అనుగుణంగానే వ్యవహరించిన చరిత్ర ఉంది.

ప్రత్యామ్నాయ చమురు వనరులను వెతుక్కోవడం అంత సులభమైన పని కాదు. 2026 జులై నాటికి భారత చమురు దిగుమతుల్లో రష్యా వాటా 51 శాతానికి పైగా ఉండగా, హార్ముజ్ జలసంధి గుండా సరఫరాలు ఇప్పటికీ పరిమితంగానే ఉన్నాయి. ప్రత్యామ్నాయ ఓడరేవుల విస్తరణను వేగవంతం చేయాలంటూ ఒమన్‌వంటి దేశాలపై భారత్ ఒత్తిడి తేవాల్సి ఉంటుంది. ముడిచమురు ధర ఇప్పటికీ బ్యారెల్‌కు 100 డాలర్లకు మించి ఉండటంతో, కొత్త సరఫరాదారులతో అనుకూలమైన ఒప్పందాలు కుదుర్చుకోవడం రోజురోజుకూ కష్టతరమవుతోంది. ఈ నెలాఖరులో జి-20 వాణిజ్య మంత్రుల సదస్సు కోసం అమెరికా వెళ్లనున్న కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌కు ఇది కీలకమైన పరీక్షగా మారనుంది. దౌత్యపరమైన చాకచక్యంతో ఎంతమేర ఉపశమనం సాధించగలరన్నదే ఇప్పుడు అసలు సవాలు. సుంకాలు అమల్లోకి రావడానికి ఇంకా 30 రోజుల సమయం ఉంది. తక్కువ సుంకం రేటును సాధించగలగడం, ప్రధాని నరేంద్ర మోదీ-ట్రంప్ మధ్య ఉన్న వ్యక్తిగత సాన్నిహిత్యానికి నిజమైన పరీక్షగా నిలవనుంది. వ్యక్తిగత సంబంధాలు ఎంతవరకూ విధానపరమైన కఠినతను మెత్తబరచగలవో ఇప్పుడు రుజువు కావాల్సి ఉంది. ఇది కేవలం భారత్‌కే పరిమితమైన సవాలు కాదు, రష్యా ఇంధనం కొనుగోలు చేసే అతిపెద్ద ఐదు దేశాల్లో చైనా కూడా ఉండటంతో, బీజింగ్ కూడా ఇదే సవాలును ఎదుర్కోనుంది. అంతర్జాతీయ చట్టాలను తన సరిహద్దులకు మించి విస్తరించుకుంటోందంటూ అమెరికాపై చైనా ఇప్పటికే విమర్శలు గుప్పిస్తోంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ చట్టాన్ని "అత్యంత కీలకమైనది"గా అభివర్ణిస్తూ ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలుపగా, రష్యా క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ దీన్ని "అమిత్రపూర్వక చర్య"గా అభివర్ణించారు. మొత్తంగా చూస్తే, ఈ చట్టం కేవలం ఒక తాత్కాలిక దౌత్య ఒత్తిడి కాదు, శాశ్వత చట్టబద్ధత కలిగిన ఒక దీర్ఘకాలిక సవాలు. దీన్ని ఎదుర్కోవడంలో భారత్ చూపే వ్యూహాత్మక చాకచక్యం, రాబోయే నెలల్లో దేశ ఆర్థిక వ్యవస్థ, దౌత్య సంబంధాల భవిష్యత్తును నిర్ణయించనుంది. తొందరపాటు నిర్ణయాలకు బదులు, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని, సమతుల్యమైన వ్యూహంతో ముందుకు సాగడమే భారత్‌కు మేలు చేస్తుందనడంలో ఎలాంటి సందేహాలు అక్కర్లేదు. ■



వయసు పెరిగే కొద్దీ మనకు నిజం బోధపడుతుంది - ప్రశాంతమైన ఇల్లు, ఆరోగ్యకరమైన శరీరం, అర్థవంతమైన పని, ప్రేమించే మనుషులే జీవితంలో అసలైన సంపదలని. బ్యాంకు బ్యాలెన్స్ పెరిగినా మనసులో నెమ్మది లేకపోతే అదో శిక్షే. పెద్ద భవంతులు, ఖరీదైన వస్తువులు క్షణికమైన సంతోషాన్నివ్వొచ్చేమో గానీ, రాత్రి ప్రశాంతంగా నిద్రపోయే భరోసా ఇవ్వలేవు. చివరికి డబ్బుతో ఇల్లు కొనగలం, కానీ మనశ్శాంతిని కొనలేం. అందుకే, జీవితం చివరిదశలో మిగిలేది బ్యాంకు లెక్కలు కాదు - మనతో నిలబడిన మనుషులు, మనం నమ్మిన సంబంధాలే.

-మహాదేవ

## వింతల్లో వింతలు

### వీడెవడండీ బాబూ..!



కళ్లు కనిపించవు. లైసెన్స్ లేదు. పైగా ఫుల్‌గా మందుకొట్టి ఉన్నాడు, అయినా ఇంగ్లండ్‌లోని ఈ 50 ఏళ్ల వ్యక్తి కారు ఎక్కి ఏకంగా 150 మైళ్లు హైవేపై దూసుకుపోయాడు! పార్ట్‌నర్‌తో నాలుగు వైన్ బాటిళ్లు కొట్టేసిన తర్వాత, బాధలు మర్చిపోదామని స్కాట్‌లాండ్ వైపు బయల్దేరిన ఇతను, ముందు వెళ్తున్న లారీ టెయిల్ లైట్లను వెంబడిస్తూ దారి కనిపెట్టుకున్నాడట! మధ్యలో పెట్రోల్ బంకులో ఆగినా, సిబ్బంది కూడా ఇతని మత్తు, అంధత్వం రెండూ గమనించలేదు. లేన్లు మారుతూ, రోడ్డు పక్కకు వెళ్తూ కూడా యాక్సిడెంట్ కాకపోవడం అదృష్టమే! చివరికి పోలీసులకు దొరికిన ఇతనికి.. కోర్టు 36 వారాల జైలు శిక్ష విధించి సస్పెండ్ చేసింది. బతికి బట్టకట్టడమే అతని అసలు 'డ్రైవింగ్ లైసెన్స్'!



## మోక్షజ్ఞ మొదటి సినిమాపై
# క్రేజీ న్యూస్


నందమూరి మోక్షజ్ఞ ఎంట్రీపై చాలా ఏళ్ల నుంచి బాలయ్య అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొత్తానికి మోక్షజ్ఞ డెబ్యూ మూవీకి వశిష్ఠ దర్శకత్వం వహించబోతున్నారు. అధికారిక ప్రకటనతో అంచనాలు భారీగా పెరిగాయి. అయితే, సినిమాపై ఇప్పుడు ఓ క్రేజీ అప్ డేట్ వినిపిస్తోంది. సోషియో-ఫాంటసీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతుంది. కథలో పునర్జన్మలు, మల్టిపుల్ టైమ్ లైన్స్ ఉంటాయని.. అలాగే భారీ విజువల్ ఎఫెక్ట్స్ కూడా కీలక అంశాలుగా ఉండొచ్చని తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో బాలయ్య ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ముఖ్యంగా కథను మలుపు తిప్పే కీలక పాత్రలో బాలకృష్ణ సుమారు 40 నిమిషాలు కనిపించనున్నారట. అయితే, మరోవైపు మోక్షజ్ఞ -వశిష్ఠ కాంబినేషన్‌పై నెగిటివ్ టాక్ ఉంది. వశిష్ఠకు ఇప్పటివరకు 'బింబిసార' ఒక్కటే పూర్తిస్థాయి విజయం. అటు 'విశ్వంభర'పై వచ్చిన చర్చ కూడా ఈ నెగిటివ్ టాక్‌కి కారణం. అయితే మోక్షజ్ఞను రొటీన్ మాస్ కథతో కాకుండా కొత్త కాన్సెప్ట్‌తో లాంచ్ చేయాలనే ఉద్దేశంతోనే వశిష్ఠను ఎంచుకున్నారనే టాక్ ఉంది. అదే నిజమైతే, "వశిష్ఠ కరెక్ట్ ఛాయిస్ అనుకోవాలి.

హాట్ స్టార్!





## 'వారణాసి'పై
# లేటెస్ట్ అప్ డేట్

దర్శకధీరుడు రాజమౌళి -మహేష్ బాబు కలయికలో రాబోతున్న సినిమా 'వారణాసి'. ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతుంది. అయితే, మహేష్ బాబుకి సంబంధించిన మిగిలిన షూటింగ్ పార్ట్‌ను సెప్టెంబర్ చివరిలో పూర్తి చేయనున్నారని, మొత్తం షూటింగ్ అక్టోబర్ మూడోవారంలో పూర్తవుతుందని తెలుస్తోంది. అలాగే, కీరవాణి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పనులు సెప్టెంబర్‌లో ప్రారంభించనున్నారు. సినిమాలో మొత్తం 6 పాటలు



ఉండనున్నట్టు ఆయన గతంలో వెల్లడించారు. కాగా ప్రియాంక ఈ సినిమాలో మందాకినిగా కనిపిస్తుండగా.. మహేశ్ రుద్రగా.. శ్రీరాముడిగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. కాగా 'వారణాసి' చిత్రం రూ.1300 కోట్లకుపైగా భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతోంది. ఈ భారీ ప్రాజెక్టును కెఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు దేశవ్యాప్తంగా మంచి స్పందన లభించింది. ఈ చిత్రానికి సంగీతాన్ని ఎంఎం కీరవాణి అందిస్తుండగా, కథా కథనాన్ని విజయేంద్ర ప్రసాద్ రూపొందించారు. ఇక ఈ సినిమాకి దేవా కట్టా సంభాషణలు అందిస్తున్నారు.





# 'దాదా' ఫస్ట్ సింగిల్ డేట్ లాకయిందా?

టాలీవుడ్ బిగ్గెస్ట్ మాస్ హీరోస్‌లో ఒకరైన నందమూరి బాలకృష్ణ హీరోగా ఇప్పుడు దర్శకుడు గోపీచంద్ మలినేనితో భారీ చిత్రం 'దాదా' చేస్తున్న సంగతి తెలిసిందే. ఓఅభిమానులు మంచి ఎగ్జైటెడ్‌గా ఎదురు చూస్తున్న ఈ స్టయిలిష్ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా పూర్తవుతుంది. అయితే ఈ సినిమాకి థమన్ సంగీతం అందిస్తున్న సంగతి తెలిసిందే. బాలయ్య అంటే సాలిడ్ మ్యూజిక్ ఇచ్చే థమన్ లేటెస్ట్‌గా ఈ సినిమా ఫస్ట్ సింగిల్‌పై అప్డేట్ ఇవ్వడం జరిగింది. ఈ సెప్టెంబర్ 24న వస్తుంది అన్నట్టుగా ఇచ్చిన స్టేట్‌మెంట్ కొంచెం ఫ్యాన్స్‌ని కన్ఫ్యూజ్ చేస్తుంది. లేటెస్ట్ ఓ యూత్ ఇంట్రాక్షన్‌లో థమన్ ఈ విషయం తెలిపాడు. అలాగే బాలయ్య, కాజల్‌పై ఓ సాంగ్‌ని న్యూజిలాండ్‌లో షూట్ చేయడానికి వెళుతున్నట్టు తెలిపాడు. సో దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి వృద్ధి సినిమాస్ నిర్మాణం వహిస్తుండగా ఈ డిసెంబర్ 24న గ్రాండ్ గా విడుదల కాబోతుంది.

# 'జార్జ్ క్రిష్'లో శర్వా క్యారెక్టర్ అదే?



దర్శకుడు శ్రీను వైట్ల -హీరో శర్వానంద్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా 'జార్జ్ క్రిష్'. అయితే, శర్వానంద్ ఈ సినిమాలో జూనియర్ సైంటిస్ట్‌గా కనిపించబోతున్నాడు. తన పాత్ర చుట్టూ సాగే డ్రామా చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుందని.. సినిమాలో చాలా ఎపిసోడ్స్ ఫుల్ ఎంటర్టైనింగ్‌గా ఉంటాయని తెలుస్తోంది. ఈ సినిమా కొత్త షెడ్యూల్ వచ్చేవారం నుంచి స్టార్ట్ చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి శర్వానంద్ సరికొత్త మేకోవర్‌లో కనిపించబోతున్నాడు. ఇక ఈ సినిమాలో నటించే హీరోయిన్ గురించి ఇప్పటికే చాలా రూమర్స్ వచ్చాయి. కాగా భాగ్యశ్రీ బోర్సేను హీరోయిన్‌గా ఫిక్స్ చేసినట్టు తెలుస్తోంది. కాగా కొత్త షెడ్యూల్‌లో జరగబోయే షూట్‌లో హీరో హీరోయిన్లపై లవ్ సీన్స్‌ను షూట్ చేస్తారని తెలుస్తోంది. అన్నట్టు ఈ సినిమాను సంక్రాంతి బరిలో దించాలని గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ కామెడీ 'విశ్వం' ఏవరేజ్‌గా నిలిచింది. దీంతో, ఎలాగైనా మళ్ళీ టాలీవుడ్‌లో తన తర్వాత సినిమాతో బిజీ అయ్యేందుకు శ్రీనువైట్ల తెగ కష్ట పడుతున్నాడట. అనిల్ సుంకర ఈ సినిమాను నిర్మించనున్నాడు.



## నాని ఫ్యాన్స్‌కు
# స్పెషల్ ట్రీట్!

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ది ప్యారడైజ్' సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమైంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన సినిమా.. ఈసారి ఎలాంటి మార్పులు లేకుండా ప్రేక్షకుల ముందుకు రానున్నట్టు చిత్ర బృందం చెబుతోంది. సెప్టెంబర్ 23నుంచే తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక ప్రదర్శనలు ప్రారంభం కానున్నాయి. అయితే సినిమా విడుదలకు ముందు నాని తన అభిమానులకు ఇచ్చే స్పెషల్ ట్రీట్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రీ రిలీజ్ ఈవెంట్ అనంతరం నాని ఏకంగా 10 వేలమంది అభిమానులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు సమాచారం. దేశవ్యాప్తంగా పలుచోట్ల నుంచి ఫ్యాన్స్ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని తెలుస్తోంది. వారందరికీ వెజ్, నాన్‌వెజ్ వంటకాలతో ప్రత్యేక భోజన ఏర్పాట్లు చేస్తున్నారనే వార్త నాని అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. ఇక 'ది ప్యారడైజ్' సెన్సార్ పూర్తి చేసుకుని 'ఏ' సర్టిఫికెట్ పొందింది. సుమారు 2 గంటల 49 నిమిషాల నిడివితో చిత్రం థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే విడుదలైన 'ఆయా షేర్', 'ఏషనాగుల' పాటలు ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ఆసక్తికరంగా ఈ సినిమాకు ప్రత్యేకంగా ట్రైలర్ విడుదల చేయకుండా నేరుగా థియేటర్లలోకి తీసుకు రావాలని మేకర్స్ నిర్ణ యించారు. కంటెంట్‌పై ఉన్న నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

## షూట్‌లో రోజూ
# భయపడేదాన్ని..

'మైసా' కోసం తన జీవితాన్ని ఇచ్చానని రష్మిక చెప్పారు. ఇందులో రిస్క్‌తో కూడిన ఎన్నో సన్నివేశాల్లో నటించానన్నారు. తాజాగా జరిగిన టీజర్ లాంచ్ ఈవెంట్‌లో రష్మిక మాట్లాడుతూ.. "నాకు ఎత్తులంటే భయం. కానీ, దర్శకుడు రియాలిటీ కావాలంటూ ఎత్తైన ప్రదేశానికి తీసుకెళ్లి దూకమన్నారు. భయంతో వణికిపోయాను. ప్రతిరోజూ షూట్‌కు వెళ్లేటప్పుడు ఏం రిస్క్ చేయమంటారోనని భయపడేదాన్ని" అని చెప్పారు. దర్శకుల కథకు ప్రాణం పోయడానికి తాను ఎంత కష్టపడడానికి అయినా సిద్ధమేనన్నారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా నవంబర్ 27న విడుదల కానుంది. ఇదిలావుంటే -రష్మిక కీలక పాత్రలో రవీంద్ర పుల్లె దర్శకత్వంలో రూపొందు తున్న 'మైసా' చిత్ర టీజర్ ఆదివారం విడుదలైంది. విభిన్నమైన యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న సినిమాలో.. రష్మిక శక్తిమంతమైన గిరిజన గోండు మహిళ పాత్రలో అలరించనున్నారు. ఈ సినిమాకి జేక్స్ బిజోయ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.




# అందుకే.. విడిపోతున్నారు!

మారుతున్న అనుబంధాలు, పెరుగుతోన్న విడాకుల కేసులపై సినీ నటి కాజల్ అగర్వాల్ స్పందించారు. మనుషుల మధ్య అనుబంధాలపై సోషల్ మీడియా ప్రభావం చూపుతోందని ఆమె అభిప్రాయపడ్డారు. ఫోన్ల కారణంగా దంపతుల మధ్య ప్రత్యక్ష సంభాషణలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెస్టారెంట్లు, డిన్నర్ డేట్లకు వెళ్లినప్పుడు కూడా చాలా మంది.. ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా ఫోన్లకే పరిమితమవుతున్నారన్నారు. అర్థవంతమైన మాటలు, ఒకరికొకరు సమయం కేటాయించుకోవడం తగ్గిపోవడం వల్లే బంధాల్లో దూరాలు పెరుగుతున్నాయని అన్నారు.

"నేను, నా భర్త ఖాళీ సమయాన్ని చాలా గౌరవిస్తాం. ప్రతివారం క్రమం తప్పకుండా డిన్నర్‌కు వెళ్తాం. ఫోన్లను పక్కనపెట్టి ప్రశాంతంగా మాట్లాడుకుంటాం" అని కాజల్ చెప్పారు. సోషల్ మీడియా వ్యామోహం నుంచి బయటపడి భాగస్వామితో.. సమయాన్ని గడపడం అలవాటు చేసుకోవాలని ఆమె సూచించారు. ఇక సినిమాల విషయానికొస్తే.. కాజల్ అగర్వాల్ ఇటీవల 'ది ఇండియా స్టోరీ'తో పలకరించారు. ప్రస్తుతం ఈ సినిమా జియోహాట్‌స్టార్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com